ANN తెలుగు
Follow: @ANNTELUGU
09-12-2024
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 09 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## మా ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నారు

**మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు**

రాష్ట్ర క్యాబినెట్ లో అర్బన్ నక్సల్స్ ఉన్నారంటారా?
బండిసంజయ్ వ్యాఖ్యలపై భగ్గు
ఈటల రాజేందర్ ది ఏ భావజాలం?
మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నాటినుండీ నామీద ట్రోల్స్
బండిసంజయ్ వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలి

వివరాలు 2లో

ప్రతిపక్షం

## గవర్నెన్స్ తక్కువ గాసిప్స్ ఎక్కువ



- ఫోన్ ట్యాపింగ్, ధరణి స్కామ్ అంటూ కాంగ్రెస్ వాళ్లు టైంపాస్ చేస్తున్నారు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ సెటైర్లు

03

స్వపక్షం

## అర్బన్ నక్సల్ ప్రభుత్వ వ్యాఖ్యలతో ఏకీభవించను



- కుటుంబం కోసమే కేసీఆర్.. దేశం కోసం మోడీ
- వ్యక్తిగత ఇమేజ్ కోసం రేవంత్ తహతహ
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

03

పాలకపక్షం

## క్రమశిక్షణ విషయంలో తగ్గేదేలే



- ఎవరైనా సరే గీతదాటితే వేటే
- బీఆర్ఎస్ కు భవిష్యత్ లేదు
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

03

## నేటి నుండి అసెంబ్లీ

సభ ముందుకు కీలక బిల్లులు

నేడు తెలంగాణ తల్లిపై సీఎం ప్రకటన



**హైదరాబాద్, మహా:** తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఖరారయ్యాయి. డిసెంబర్ 9వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10.30 గంటలకు శాసన సభ, శాసన మండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి.

మిగతా 4లో

# అదరహో

## వైమానిక విన్యాసాలు అద్భుతం

**నెక్లెస్ రోడ్ లో అట్టహాసంగా ఎయిర్ షో**

ప్రజాపాలన విజయోత్సవాల్లో జగేల్
మంత్రులతో కలిసి తిలకించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
వేలాదిగా హాజరై.. సంభ్రమాశ్చర్యాలతో తిలకించిన ప్రజలు
9 సూర్య కిరణ్ విమానాలతో ఎయిర్ షో అద్భుతం
ఎయిర్ ఫోర్స్ గ్రూప్ కెప్టెన్ అజయ్ దాశరథి నాయకత్వం



ఆకాశం జిగేల్ అనేలా.. కళ్ళు మిరుమిట్లు గొలిపేలా అద్భుత వైమానిక విన్యాసాలకు హైదరాబాద్ ట్యాంక్ బండ్ వేదికైంది. ప్రజా పాలన – ప్రజా విజయోత్సవ వేడుకలలో భాగంగా అట్టహాసంగా ఎయిర్ షోను నిర్వహించారు.. ఈ ఎయిర్ షోను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అధికారులు, ప్రజలు తిలకించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నెక్లెస్ రోడ్ లో ఈ ఎయిర్ షో నిర్వహించారు. హుస్సేన్ సాగర్‌పై అద్భుతంగా వైమానిక విన్యాసాలు జరిగాయి. ఒకే సారి ఆకాశంలో 9 ఎయిర్ క్రాఫ్ట్స్ సందడి చేస్తున్నాయి. సూర్య కిరణ్ టీమ్ ఆధ్వర్యంలో 9 ఎయిర్ క్రాఫ్ట్స్ విన్యాసాలు చేస్తున్నారు. ప్రపంచంలో అత్యుత్తమమైన 5 బృందాల్లో సూర్యకిరణ్ టీమ్ ఒకటిగా పేరుపొందింది ఎయిర్ ఫోర్స్ గ్రూప్ కెప్టెన్ అజయ్ దాశరథి నాయకత్వం వహించారు. ప్రపంచంలో అత్యుత్తమమైన 5 బృందాల్లో సూర్యకిరణ్ టీమ్ ఒకటిగా పేరుపొందింది. ఎయిర్ షోను చూసేందుకు ప్రజలు భారీగా ట్యాంక్ బండ్ కు వచ్చారు. దీంతో ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలు జనంతో కిక్కిరిసిపోయాయి. - మహా, హైదరాబాద్

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 77,620 |
| 22 క్యారెట్ | 71,150 |
| సిల్వర్ (కేజీ) | 92,000 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ | 81,709.12 |
| నిఫ్టీ | 24,677.80 |

### ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 190 | 230 | 250 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 170 | 210 | 220 |

### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 6.21 | 186.3 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 6.21 | 186.3 |
| రిటైల్ గుడ్డు ధర | 6.41 | 192.3 |

## తెలంగాణ తల్లి విగ్రహం మార్పు మూర్ఖత్వం

**ప్రభుత్వాలు చేయాల్సిన పనులు ఇవేనా?**

కాంగ్రెస్‌పై మండిపడ్డ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శాసనసభ సమావేశాలకు హాజరుకావాలి
అంశాలవారీగా ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలి
ఫిబ్రవరిలో భారీ బహిరంగసభ.. సర్కారు వైఖరిని ఎండగడతాం
ఫిబ్రవరి తర్వాత కమిటీలు.. సభ్యత్వ నమోదు
బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం

02



## కాంగ్రెస్ పాలన అంతా వంచనే

**అప్పుడు ఇరిగేషన్ పెరిగితే ఇప్పుడు ఇరిటేషన్ పెరుగుతోంది**

ఏడాదిగా నిర్బంధాలు, నిరంకుశత్వమే..

మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్.. బీఆర్ఎస్ ఛార్జిషీట్ విడుదల

**హైదరాబాద్, మహా:** కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ పెరిగితే.. రేవంత్ పాలనలో ఇరిటేషన్ పెరిగిందని బీఆర్ఎస్ మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యంగా మారిందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలోనూ ఇలాంటి నిర్బంధాలు, నిరంకుశత్వం చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూళ్ల ముందు పోలీస్ పికెట్ల గురించి ఏనాడైనా విన్నామా అని ప్రశ్నించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నిర్బంధాలు కొనసాగుతున్నాయని చెప్పారు. తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ఏడాది పాలనపై

మిగతా 2లో



## అసైన్డ్ భూములపై హక్కులు



**త్వరలోనే నిర్ణయం.. మంత్రి పొంగులేటి**

కొన్నిచోట్ల పొజిషన్‌లో పేదలుంటే, రికార్డులు ధనవంతుల పేర్లపై ఉన్నయ్
అట్లాంటి భూములపై పేదలకు పట్టాలు
ధరణి పేరుతో ప్రభుత్వ భూములు కబ్జా చేసిన్రు
వాటిపై ఎంక్వైరీ చేస్తున్నం
వీఆర్వోల్లో అర్హత ఉన్న వెయ్యి మందిని సర్వేయర్లుగా తీసుకుంటం
అసెంబ్లీ సమావేశాల్లోనే ఆర్వోఆర్ చట్టం
ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితా ఒకేసారి తయారు చేస్తం

02

## చలో ఢిల్లీ రణరంగం

**రైతులపై టియర్ గ్యాస్..**

పంజాబ్–హర్యానా బార్డర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత


02

## తెలంగాణపై ప్రేమ ఉంటే కేసీఆర్, కిషన్ రెడ్డి వస్తారు

**వస్తే.. పోయేదేముంది.. రండి**

తెలంగాణ తల్లిరూపం మంచి విగ్రహం వచ్చింది
విగ్రహావిష్కరణకు రావడం వారి విజ్ఞత
బీజేపీ బీఆర్ఎస్ పై ఛార్జిషీట్ వేయాలి
ఎఎన్ఎన్–మహా ఇంటర్వ్యూలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

03



# అసైన్డ్ భూములపై హక్కులు

## త్వరలోనే నిర్ణయం.. మంత్రి పొంగులేటి

కొన్నిచోట్ల పొజిషన్‌లో పేదలుంటే, రికార్డులు ధనవంతుల పేర్లపై ఉన్నయ్

అట్లాంటి భూములపై పేదలకు పట్టాలు

ధరణి పేరుతో ప్రభుత్వ భూములు కబ్జా చేసిన్రు.. వాటిపై ఎంక్వైరీ చేస్తున్నం

వీఆర్వోల్లో అర్హత ఉన్న వెయ్యి మందిని సర్వేయర్లుగా తీసుకుంటం

అసెంబ్లీ సమావేశాల్లోనే ఆర్వోఆర్ చట్టం

ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితా ఒకేసారి తయారు చేస్తం




**హైదరాబాద్, మహా:** గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూములపై పేదలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తామని, వాటి క్రయవిక్రయాలు జరిగేలా పట్టాలు ఇస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. దీనిపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లోని పేదలకు గతంలో ఇందిరమ్మ సర్కార్ అసైన్డ్ భూములు ఇచ్చిందని, అయితే అవసరాలకు వాటిని అమ్ముకోలేని పరిస్థితి ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే ఆ అసైన్డ్ భూములపై పేదలకు పూర్తి హక్కులు కల్పిస్తామన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే పేదలకు పంచడమని, అది భూమి అయినా.. ఇండ్లు ఇవ్వడమైనా అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం అర్హుల వివరాలను ఒకేసారి యాప్లో ఎంట్రీ చేస్తామని, అందులో నుంచే దశల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామనన్నారు. రాష్ట్రంలో రికార్డుల్లో ఉన్న భూమికి, ఫీల్డులో ఉన్న భూమికి పొంతనలేదన్నారు. ఇది గత పదేండ్లలో ఎక్కువైందదని, ధరణి వచ్చాక లెక్కలు ఏ మాత్రం సరిపోలడం లేదన్నారు. రైతుబంధు కోసం ధరణిలో భూములు నమోదు చేసినట్టు తేలిందన్నారు. కొన్ని చోట్ల పొజిషన్లో పేదోడు ఉండి వ్యవసాయం చేస్తుంటడు, ఆ పేదోని పేరు మీద పట్టా ఉండదు, అదే భూమి ధనవంతుడి పేరు మీద, బీఆర్ఎస్ లీడర్ల పేరు మీద ఉంటది, అట్లాంటి భూములన్నింటిపైనా ఎంక్వైరీ చేస్తామన్నారు. ఆ ధనవంతుల పేరు మీద ఉన్న భూమిని నిజంగా పొజిషన్ లో ఉన్న పేదోడి పేరు మీదకు మారుస్తామని, తిరుమలగిరి మండలంలో పైలట్ ప్రాజెక్ట్ చేస్తే 2,600 ఎకరాల్లో పొజిషన్ లో ఉన్న రైతులు పట్టాలు లేకుండా సాగు చేసుకుంటున్నారన్నారు. త్వరలోనే వారికి సీఎం చేతుల మీదుగా పట్టాలు అందజేస్తమని వెల్లడించారు.

### సర్వేయర్లుగా వీఆర్వోలు..

రాష్ట్రంలో భూముల హద్దుల విషయంలో పంచాయితీలు ఎక్కువగా ఉన్నాయని గుర్తించామని పొంగులేటి తెలిపారు. గెట్టు పంచాది పరిష్కరించుకుందామని ఎవరైనా సర్వేకు పెట్టుకుంటే నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందంటూ కారణం రాష్ట్ర వ్యాప్తంగా 232 మంది సర్వేయర్లు మాత్రమే ఉన్నారన్నారు. 10 వేలకు పైచిలుకు రెవెన్యూ గ్రామాలకు అంత తక్కువ మంది సర్వేయర్లు మాత్రమే ఉండటం ఏంటి? అందుకే త్వరలో వెయ్యి మంది సర్వేయర్లను తీసుకుంటున్నామని వెళ్ళడించారు. గతంలో ఉన్న వీఆర్వోల నుంచే సర్వేయర్లను తీసుకుంటామని, వారికి ప్రత్యేకంగా ఆరు నెలల పాటు శిక్షణ ఇస్తాం'' అని చెప్పారు.


### ధరణి అక్రమాలపై విచారణ చేస్తున్నం

గత ప్రభుత్వం ధరణిని ప్రైవేట్ ఏజెన్సీ టెర్రాసిస్కు అప్పగించి భూములను ఆగం జేసిందని పొంగులేటి మండిపడ్డారు. ధరణి పోర్టల్ ను ఎన్ఐసీకి అప్పగించామని, త్వరలోనే టెర్రాసిస్లో జరిగిన వ్యవహారాలపై ఎంక్వైరీ చేస్తమన్నారు. ధరణిని అడ్డం పెట్టుకుని ప్రైమ్ ఏరియాల్లో 2 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ పట్టాలు చేశారు. సిద్దిపేటలో దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇట్లనే మాయం చేసి, 40 మంది పట్టాలుగా మార్చుకున్నారన్నారు. ఆ తరువాత ఆ భూమిని కంపెనీలకు అమ్ముకున్నాన్నారన్నారు. వీటన్నింటిపై ఎంక్వైరీ చేయిస్తున్నామని. 58,59 జీవోలను అడ్డం పెట్టుకుని అక్రమంగా 19 ఎకరాలు రెగ్యులరైజ్ చేసుకున్నరని, ఆ 2 వేల ఎకరాలు, ఈ 19 ఎకరాలు ప్రొహిబిషన్ లో పెట్టామన్నారు. రంగనాయక సాగర్ దగ్గర మాజీ మంత్రి హరీష్ రావు ఒకసారి భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చాక, మళ్లీ డినోటిఫై చేయించి.. ఆ రైతులను భయపెట్టి పట్టాలు చేసుకున్నారని తెలిపారు. దీనిపైనా ఎంక్వైరీ చేస్తున్నామని, రిపోర్ట్ వచ్చాక చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### ధరణి స్థానంలో కొత్త పోర్టల్

ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఆర్వోఆర్-2024 చట్టం తీసుకొస్తామని పొంగులేటి వెల్లడించారు. "ధరణి స్థానంలో కొత్త వెబ్ పోర్టల్ వస్తుందన్నారు. ఇప్పుడు ఒక పట్టాదారు కాలమ్ మాత్రమే ఉన్నది. కొత్తగా తెచ్చే పోర్టల్ లో 12 నుంచి 14 కాలమ్ లు ఉంటాయి. పోర్టల్లోనే కాకుండా మ్యాన్ వెల్ గాను నమోదుకు అవకాశం ఉంటుందన్నారు. "నేను ప్రభుత్వంలో నెంబర్ 2,3 కాదు.. నెంబర్11. నా వెంట 15 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని ప్రభుత్వం నాకు ప్రాధాన్యం ఇస్తుందనేది అబద్ధం. అవకాశం వచ్చింది మంత్రిగా సేవలు అందిస్తున్నానని అన్నారు. రాజకీయాల్లోకి రాకముందే కాంట్రాక్టర్‌ను ఇప్పుడు నా బంధువులు, కుటుంబ సభ్యులు కంపెనీలలో ఎక్కడైనా డైరెక్టర్లుగా ఉన్నారు కావొచ్చు. ఆనాడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలోనూ నేను ఉన్నాను. మరి అప్పుడేందుకు ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ గురించి మాట్లాడలేదు. ఇప్పుడెందుకు గుర్తుకొస్తున్నది. వాళ్లవన్నీ అవకాశవాద రాజకీయాలు. ఈడీకి నా దగ్గర ఏం దొరకలేదు. అంత అనుమానం ఉంటే అర్ధరాత్రి పూట కేంద్రంలో నంబర్ 1,2లను పోయి కలిసిందు కదా. వాళ్లనే అడిగి తెలుసుకోవాలి నా ఇంట్లో ఏం దొరికిందో'' అని పరోక్షంగా కేటీఆర్ ను ఉద్దేశించి అన్నారు.

# కాంగ్రెస్ పాలన అంతా వంచనే




(మొదటిపేజీ తరువాయి)

'ఏడాది పాలన-ఎడతెగని వంచన' పేరుతో బీఆర్ఎస్ ఛార్జిషీట్‌ను విడుదల చేశారు.

**ప్రజాస్వామ్యం ఖూనీ..**

ఈ సందర్భంగా హరీశ్ మాడారు.. 'కాంగ్రెస్ ఏడాది పాలనలో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నిర్బంధాలు కొనసాగుతున్నాయి. ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. మీడియా, సోషల్ మీడియాలపై ఆంక్షలు విధించారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారు. గిరిజన బిడ్డల మీద లాఠీ చార్జి చేశారు.తిట్లు, ఒట్లు, పోట్లు ఇదే రేవంత్ పాలన. పోలీసులతోనే పోలీసు కుటుంబాలను కొట్టించారు. ప్రతికూల దృక్పథంతో రేవంత్ పాలన ప్రారంభమైంది. ఉన్న పరిశ్రమలు తరలిపోతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగం ఢమాలైంది. 6 గ్యారంటీలు, 420 హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైంది. సీఎం ఛాంబర్‌కు ఎవరూ వెళ్లకుండా ఆంక్షలు విధించారని ' అన్నారు.

**అన్ని రంగాల్లో విఫలం..**

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ డ్యామేజీ అయిందని హరీశ్ అన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ వరద సహాయక చర్యల్లోనూ ఘోరంగా విఫలమైందని, వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన తమపై రాళ్ల దాడి చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆందోళనలు, అలజడులు పెరిగిపోయాయని, బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ప్రయాణికులు కొట్టుకుంటున్నారని వాపోయారు.

### అంతా మోసం..

'అన్ని పంటలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. బోనస్‌ను బోగస్ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఇప్పుడేమో సన్నవడ్లకే బోనస్ మాటమార్చారు. మద్దతు ధరకంటే తక్కువకే రైతులు ధాన్యం అమ్ముకున్నారు. రైతుల ధాన్యం సగం దళారుల పాలైంది. వ్యవసాయ డిక్లరేన్ లోని 9 హమీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదు. వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు ఇస్తామని మోసం చేశారు. కౌలు రైతులకు కూడా రైతుబంధు ఇస్తామని మోసం చేశారు. ఏడాదిలోపే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రేవంత్ మోసం చేశారని అన్నారు.

**మురికి కూపాలుగా పల్లెలు**

'కేసీఆర్ హయాంలో క్రమం తప్పకుండా పల్లెప్రగతి, పట్టణ ప్రగతికి నిధులు ఇచ్చేది. రేవంత్ పాలనలో పల్లెలకు నిధులు రాక మురికి కూపాలుగా మారాయి. హరితహారంలో నాటిని మొక్కలకు నీళ్లు పోసే దిక్కు లేదు. హైడ్రా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇండ్లు కూల్చారు. కూలగొట్టిన ఇండ్లకు ఎవరు నష్టపరిహారం ఇస్తారు' అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

### విద్యా భరోసా ఏదీ?

విద్యా భరోసా కింద రూ.5 లక్షలు ఇస్తామని మోసం చేశారని హరీశ్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను మోసం చేశారని అన్నారు. 'పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.4.26 లక్షల కోట్లు అప్పుచేస్తే.. రేవంత్ సర్కార్ ఏడాదిలోనే రూ.లక్ష కోట్లు అప్పు చేసింది. కాళేశ్వరం నీళ్లు లేకుండానే కోటీ 53 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండిందని ముఖ్యమంత్రి సహా మంత్రులంతా అబద్ధాలు చెబుతున్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో 68 లక్షల మెట్రిక్ టన్నుల వరి పంటనే ఎలా పండింది?. కేసీఆర్ హయాంలో వరి పంట కోటీ 60 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. కేసీఆర్ ఏమీ చేయకుండానే కోటి మెట్రిక్ టన్నుల పంట పెరిగిందా?. కాళేశ్వరం ప్రాజెక్టు సహా అనేక సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాం. మిషన్ కాకతీయలో భాగంగా వేలాది చెరువులు బాగుచేశాం. వేలాది చెక్‌డ్యాములు నిర్మించి నీళ్లు అందించాం. ఏడాదికి 6.5 లక్షల ఎకరాలు కొత్త ఆయకట్టు తీసుకొస్తామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఏడాదిలో 6,500 ఎకరాలైనా కొత్త ఆయకట్టు వచ్చిందా?. పాలమూరు బిడ్డనని చెప్పుకునే నైతిక అర్హత రేవంత్‌రెడ్డికి లేదు. కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ పెరిగింది. రేవంత్ పాలనలో ఇరిటేషన్ పెరిగిందని' హరీశ్ ఆరోపించారు.

## తెలంగాణ తల్లి విగ్రహం

# మార్పు మూర్ఖత్వం

## ప్రభుత్వాలు చేయాల్సిన పనులు ఇవేనా?

కాంగ్రెస్‌పై మండిపడ్డ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శాసనసభ సమావేశాలకు హాజరుకావాలి

అంశాలవారీగా ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలి


ఫిబ్రవరిలో భారీ బహిరంగసభ.. సర్కారు వైఖరిని ఎండగడతాం

ఫిబ్రవరి తర్వాత కమిటీలు.. సభ్యత్వ నమోదు

బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం



**హైదరాబాద్, మహా:** తెలంగాణ తల్లి విగ్రహం మార్పు మూర్ఖత్వమని.. ప్రభుత్వాలు చేయాల్సిన పనులు ఇవేనా? అంటూ బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రశ్నించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో.. సభలో అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన ఆదివారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడంపై కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఇలా మార్పులు చేసుకుంటూ పోతే ఎలా? అని నిలదీశారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శాసనసభ సమావేశాలకు హాజరుకావాలని సూచించారు. అంశాలవారీగా ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలన్నారు. రైతుబంధు తెచ్చిన ఉద్దేశం, ప్రయోజనాలు వివరించాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు చెప్పారు. రాష్ట్రప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందన్నారు. గురుకులాలు, విద్యారంగంలో వైఫల్యాలు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మూసీ, హైడ్రా విషయంలో ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని.. నిర్బంధ పాలన గురించి అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ఆధారంగా వైఫల్యాలను ఎత్తి చూపాలన్నారు. ఫిబ్రవరిలో భారీ బహిరంగసభ నిర్వహిద్దామని, ఈ బహిరంగ సభలో సర్కార్ వైఖరిని ఎండగతామన్నారు. ఫిబ్రవరి తర్వాత పార్టీలో అన్ని కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. కమిటీల ఏర్పాటు తర్వాత సభ్యత్వ నమోదు ఉంటుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ తల్లి అందించిన స్ఫూర్తిని వివరించాలన్నారు.






# ఘోర రోడ్డు ప్రమాదం

### ఇద్దరు కానిస్టేబుళ్ల దుర్మరణం.. గజ్వేల్‌లో హిట్ అండ్ రన్ ఘటన



**సిద్దిపేట, మహా:** సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పట్టణంలోని జాలిగామ బైపాస్ రోడ్డుపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు కానిస్టేబుళ్లు మృతిచెందారు. మృతులు పరందాములు, వెంకటేశ్‌గా గుర్తించారు. వీరిలో పరందాములు రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో, వెంకటేశ్ దౌల్తాబాద్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే వీరిద్దరు ఈసీఎల్‌లో జరుగుతున్న మారథాన్ రన్నింగ్‌లో పాల్గొనడానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. కాగా, కానిస్టేబుళ్ల మృతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

# చలో ఢిల్లీ రణరంగం

## రైతులపై టియర్ గ్యాస్..

### పంజాబ్–హర్యానా బార్డర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత



**న్యూఢిల్లీ, మహా:** డిమాండ్ల సాధనే లక్ష్యంగా రైతులు చేపట్టిన 'చలో ఢిల్లీ' ర్యాలీ రణరంగంగా మారింది. పంజాబ్-హర్యానా బార్డర్ శంభు వద్ద ఆదివారం మరోసారి తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కనీస మద్దతు ధరకు లీగల్ గ్యారంటీ ఇవ్వాలని 101 మంది రైతుల బృందం శంభు నుంచి ఢిల్లీకి మళ్లీ పాదయాత్ర ప్రారంభించారు. అయితే వీరి పాదయాత్ర కొన్ని మీటర్లు దాటగానే హర్యానా పోలీసులు వారిని అడ్డుకున్నారు. నిరసన తెలిపేందుకు అనుమతి పత్రాలను చూపాలని హర్యానా పోలీసులు రైతులను కోరారు. దీంతో శంభు వద్ద రైతులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆందోళనల నేపథ్యంలో పోలీసులు రైతులపైకి టియర్ గ్యాస్ ప్రయోగించారు.

### రైతుల ఆగ్రహం

ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న ఓ రైతు మాట్లాడుతూ.. 'పోలీసులు ఐడీ కార్డులు చూపాలని అంటున్నారు. ఐడీ చూయిస్తే ఢిల్లీకి వెళ్లేందుకు అనుమతిస్తారా..? ఢిల్లీకి వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు అంటున్నారు. మరి తామేందుకు ఐడీ కార్డులు ఇవ్వాలి.' అని ప్రశ్నించాడు. పోలీసులు స్పందిస్తూ.. 'ఐడీ కార్డులను తనిఖీ చేసిన తర్వాతే రైతులను ముందుకు వెళ్లనిస్తాం. మా వద్ద 101 మంది రైతుల జాబితా ఉంది. కానీ ఇక్కడి వచ్చిన వాళ్లంతా లిస్టులో ఉన్న వాళ్లు కాదు. ఐడీ కార్డులు చూయించాలన్నందుకే ఆందోళనకు దిగారు.' అని తెలిపారు.



# మా ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నారు

## మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు

రాష్ట్ర క్యాబినెట్‌లో అర్బన్ నక్సల్స్ ఉన్నారంటారా?

బండిసంజయ్ వ్యాఖ్యలపై భగ్గు

ఈటల రాజేందర్ ది ఏ భావజాలం?

మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నాటినుండీ నామీద ట్రోల్స్

బండిసంజయ్ వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలి

**మహబూబాబాద్, మహా:** బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నాయని మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. మహబూబాబాద్‌లో మంత్రి సీతక్క ఆదివారం పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడుతూ... తమ ప్రభుత్వానికి సంవత్సర కాలంలో ప్రజలు ఆమోదం తెలిపారన్నారు. రాష్ట్ర క్యాబినెట్‌లో అర్బన్ నక్సలెట్స్ ఉన్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్న వాఖ్యలను ఖండిస్తున్నానని మంత్రి సీతక్క అన్నారు. తాను మాత్రమే నక్సల్స్ ఉద్యమంలో పాల్గొన్నానని.. వరంగల్‌లో లాయర్‌గా పనిచేశానని గుర్తుచేశారు. తాను మూడుసార్లు ప్రజా ప్రతినిదిగా పనిచేశానని అన్నారు. బీజేపీ పార్టీలో ఉన్న ఎంపీ ఈటల రాజేందర్‌ది ఏ భావజాలమో బండి సంజయ్ తెలుసుకోవాలన్నారు. నేరుగా బండి సంజయ్ తనపై కామెంట్స్ చేయండి , కానీ క్యాబినెట్ అంతటిని అనడం సరి కాదని అన్నారు. బీజేపీ మద్దతుతో టీడీపీ నుంచి గతంలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని గుర్తుచేశారు. వరంగల్, కరీంనగర్ పోరాటాల గడ్డ అని.. ఈ విషయం బండి సంజయ్ తెలుసుకోవాలని మంత్రి సీతక్క చెప్పారు. బీజేపీ అగ్ర నాయకులు మోదీ, అమిత్ షాలు మావోయిస్టులను జన జీవన స్రవంతిలోకి రమ్మని అంటుంటే బండి సంజయ్ తమను అర్బన్ నక్సలెట్స్ అనడం శోచనీయమన్నారు. తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి తనను చాలా విధాలుగా సోషల్ మీడియాలో ట్రోల్ చేసి మనసును నొప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా బాధగా ఉందని భావోద్వేగానికి లోనయ్యారు. బండి సంజయ్ తన వాఖ్యలను వెనుక్కు తీసుకోవాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు.

### ఎన్‌కౌంటర్ లేని తెలంగాణ మా ధ్యేయం

ఎన్‌కౌంటర్ లేని తెలంగాణ, శాంతి భద్రతల తెలంగాణనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి సీతక్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే పేదలకు ఇళ్లు, భూములు పంపిణీ చేశామన్నారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని రైతులను మోసం చేసిందని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకంతో రైతులకు రుణాలు రీ షెడ్యూల్ చేయకపోవడంతో రుణమాఫీ అర్హతను కోల్పోయారని మంత్రి సీతక్క తెలిపారు.

# మంచులో మంటలు!



## కొట్టుకున్న మోహన్‌బాబు, మనోజ్.. పోలీస్‌స్టేషన్ మెట్లెక్కిన తండ్రీ కొడుకులు

### మంచు ఫ్యామిలీలో గొడవలెందుకు?.. అసలేం జరుగుతోంది?

**హైదరాబాద్, మహా:** 'మంచు' ఫ్యామిలీలో అగ్గి రాజుకుంది. తండ్రీకొడుకులైన మంచు మోహన్ బాబు, మంచు మనోజ్ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇద్దరూ ఒకరిపై ఒకరు దాడి చేసుకుని పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కారు. నగరంలోని పహాడి షరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో వీరిద్దరూ ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేశారు.

**ఆస్తుల వ్యవహారంలో..**

మోహన్ బాబు, మంచు మనోజ్ పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఆస్తుల, స్కూలు వ్యవహారంలో వీరిద్దరి మధ్య దాడులు జరిగినట్లుగా తెలుస్తోంది. తనపై తండ్రి మోహన్ బాబు దాడి చేశారని మనోజ్ ఫిర్యాదు చేస్తే.. తనపై కొడుకు మనోజ్ దాడి చేశాడని మోహన్ బాబు ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో వీరిరువురు ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. గాయాలతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మరీ మంచు మనోజ్ ఫిర్యాదు చేశారని.. తనతో పాటు తన భార్యపై కూడా తండ్రి మోహన్ బాబు దాడి చేశారని మంచు మనోజ్ తన ఫిర్యాదులో పేర్కొన్నట్లుగా తెలుస్తోంది. ఈ ఫిర్యాదులతో మరోసారి మంచు ఫ్యామిలీ వార్తలలో హైలెట్ అవుతోంది.

**వినిపిస్తున్న మరో కథనం ఏమిటంటే..**

మంచు మనోజ్ పైన మంచు మోహన్ బాబు అనుచరుడు వినయ్ దాడి చేసినట్లుగా తెలుస్తోంది. మోహన్ బాబు అనుచరుడు వినయ్‌పై మంచు మనోజ్ ఫిర్యాదు చేశారు. స్కూల్, ఆస్తుల విషయంపైనే దాడులు జరిగాయని, విద్యానికేతన్ సంస్థలో మోహన్ బాబు అనుచరుడు వినయ్ కీలక పదవిలో ఉన్నారని తెలుస్తోంది. వినయ్ కొంతమందితో కలిసి మనోజ్‌పై దాడి చేశాడని మరోవైపు టాక్ వినబడుతోంది.

**అవన్నీ అసత్య ప్రచారాలే..**
**మంచు ఫ్యామిలీ ప్రకటన**

అయితే ఈ దాడి, ఫిర్యాదులలో నిజం లేదని, అవన్నీ అసత్య ప్రచారాలే అంటూ మరో వార్త వైరల్ అవుతోంది. "మోహన్ బాబు, మంచు మనోజ్ పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారనే వార్తల్లో నిజం లేదు. మంచు మనోజ్ దెబ్బలతో వచ్చి మరీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు ఊహాజనితమైన కథనాలు వ్యక్తమవుతున్నాయి. ఆ కథనాలన్నీ అసత్య ప్రచారాలే. వాటిలో నిజం లేదు. ఆధారాలు లేకుండా అసత్య ప్రచారాలను చేయకండి" అంటూ మంచు మోహన్ బాబు ఫ్యామిలీ ఒక ప్రకటనను విడుదల చేసింది.

**మంచు ఫ్యామిలీలో అసలేం జరుగుతుంది?**

ఇండస్ట్రీలో మంచి పేరున్న కుటుంబాల్లో మంచు ఫ్యామిలీ ఒకటి. అసలు.. టాలీవుడ్ సినిమా ఒక పుస్తకం అయితే.. అందులో మోహన్ బాబుకు ఒక ప్లేస్ ఖచ్చితంగా ఉంటుంది. సినిమాల్లో ఒక ప్రస్తానం క్రియేట్ చేసుకున్న నటుడు ఆయన. సినిమాల్లో చెదిరిపోని ముద్ర వేసుకున్న మోహన్ బాబు.. పర్సనల్ లైఫ్ మాత్రం ఎప్పుడూ వివాదాలతో చుట్టు ముడుతున్నాయి. నిజానికి.. తెరపై ఎంతో హుందాగా, గంభీరంగా కనిపించే మోహన్ బాబు.. తెరవెనుక మాత్రం పలు విషయాల్లో ట్రోల్ అవుతూ ఉన్నారు. తాజాగా జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపింది. తండ్రీకొడుకులకు ఎందుకు పడటంలేదు? ఎందుకు గొడవలు జరుగుతున్నాయి? ఆస్తుల గొడవలేనా? మరేదైనా అన్న చర్చ తెలుగు రాష్ట్రాలో జోరుగా సాగుతోంది.

# తెలంగాణపై ప్రేమ ఉంటే కేసీఆర్, కిషన్ రెడ్డి వస్తారు

## వస్తే.. పోయేదేముంది.. రండి

- తెలంగాణ తల్లిరూపం మంచి విగ్రహం వచ్చింది
- విగ్రహావిష్కరణకు రావడం వారి విజ్ఞత
- బీజేపీ బీఆర్ఎస్ పై ఛార్జిషీట్ వేయాలి
- ఎఎన్ఎన్- మహా ఇంటర్వ్యూలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి




**హైదరాబాద్, మహా :** తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు కేసీఆర్, కిషన్ రెడ్డి రావాలని కోరుకుంటున్నామని, తాను మళ్ళీ ఆహ్వానం పలుకుతున్నా రావాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం సచివాలయంలో విగ్రహావిష్కరణ నేపథ్యంలో ఎఎన్ఎన్‌మహా ప్రతినిధులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇంటర్వ్యూ వివరాలు

**మహా- బిఆర్ఎస్ పార్టీ ఏడాది పాలన మీద ఛార్జిషీట్ విడుదల చేసింది. ఎలా చూస్తారు?**



మంత్రి పదేళ్లు పాలనను గాలికి వదిలేసి ప్రజా పాలన కొనసాగిస్తున్న మా ప్రభుత్వంపై చార్జిషీట్ వేయడమేంటి. ప్రతి అకౌంట్లో 15 లక్షలు వేస్తామని 11 ఏళ్ల నుండి మోసం చేస్తున్న బీ జే పీ పై వేయాలి చార్జిషీట్, దళిత ముఖ్యమంత్రి, ఇంటికో ఉద్యోగం ఇలా ఎన్నో చెప్పిన బీఆర్ఎస్ అప్పుడెందుకు వేయలేదు చార్జిషీట్ . ప్రధానమంత్రి అందరి అకౌంట్లలో 15లక్షలు వేస్తా అన్నడు. 2కోట్ల ఉద్యోగాలు అన్నడు. ఎవరిమీద ఛార్జిషీట్ వేయాలి. ఎంతమందికి 15లక్షలు వేయాల్సి ఉంది. నీ పాలనలో అదానీ అంబానీ తప్ప ఎవరు బాగుపడ్డరు. మేం 8 నెలలు అధికారంలో ఉన్నం. ఇప్పటికే చాలా చేసినం. ఇంకా చాలా చేస్తం. మరో తొమ్మిదేళ్లు అధికారంలో ఉంటాం.

**మహా- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు కేసీఆర్ వస్తారా?**



మంత్రి రమ్మని ఆహ్వానించాం. కేసీఆర్, కిషన్ రెడ్డి రావాలని కోరుకుంటున్నం. తెలంగాణ మీద ప్రేమ ఉంటే వస్తరు. రావడం రాకపోవడం వారి విజ్ఞత. వస్తే పోయేదేం లేదు. రండి. మంచి విగ్రహం. మా ఆర్ అండ్ బి శాఖ ద్వారా దీనిని ఏర్పాటుచేసే అవకాశం లభించింది. మంచి ఆర్కిటెక్ట్ తో మంచి విగ్రహం చేయించినం. రాకపోతే మిస్ అయితరు. లక్షలమంది వచ్చి చూస్తరు. అమరవీరులకు నివాళులు అర్పించండి. విగ్రహం చూడండి.

**మహా- బండి సంజయ్, కిషన్ రెడ్డి రావడం లేదని చెప్పారు?**

మంత్రి తెలంగాణ మీద ప్రేముంటే రావాలి. ఆరోజు కిషన్ రెడ్డి, యెండల ఎమ్మెల్యేలుగా ఉంటే యెండల రాజీనామా చేసిండు. కిషన్ రెడ్డి చేయలేదు. నేను తెలంగాణ రాష్ట్రంలోనే తీసుకుంటా అని మా ప్రభుత్వం వచ్చేదాకా తీసుకోలే. శ్రీకాంతాచారి తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసుకుంటే , కేసిఆర్ మాత్రం ఎట్ల బయటపడ్డరో ప్రజలందరికి తెలుసు . హరీష్ రావు, కేటీఆర్ ది రాజకీయ ఉనికి పోరాటం తప్పా.. నిజమైన ప్రతిపక్ష పాత్ర కాదు. బీఆర్ఎస్ పార్టీకి కాంగ్రెస్ ప్రజాపాలనపై చార్జ్ షీట్ వేసేంత నైతికత లేదు. దళిత ముఖ్యమంత్రి, ఇంటికో ఉద్యోగం.. ఒక్కటి కాదు వందసార్లు తలనరుక్కుంటా అన్న కేసిఆర్ ఇప్పుడు ఫామ్ హౌస్ కు పరిమితమాయ్యారు.

# క్రమశిక్షణ విషయంలో తగ్గేదేలే

## టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**మహా:** క్రమశిక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని.. ఎవరైనా సరే గీత దాటితే వేటుతప్పదంటూ టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నాటి ఫిరాయింపులు, నేటి చేరికలకు తేడా ఉందన్నారు. ప్రభుత్వాన్ని కూలుస్తామంటే ఊరుకోవాలా..? రాజకీయాల్లో కొన్నిసార్లు నిర్ణయాలు మారుతుంటాయని తెలిపారు. కేసీఆర్ మళ్లీ గెలిచి ఉంటే తెలంగాణను అమ్మేసేవారని.. కేటీఆర్, హరీష్‌రావు ఆరోపణలు అర్థరహితం అంటూ మహేష్‌గౌడ్ పేర్కొన్నారు. బిఆర్ ఎస్ కు భవిష్యత్ లేదని ఎమ్మెల్యేలు భావిస్తున్నారన్నారు. చాలా మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారన్నారు. తండ్రి, కొడుకు తప్ప బీఆర్ఎస్‌లో ఎవరూ మిగలరన్నారు.. మహారాష్ట్రలో పార్టీ ఓటమికి వేరే కారణాలున్నాయని.. స్థానిక సంస్థల ఎన్నికల్లో..మెజార్టీ స్థానాలు తామే గెలుస్తామంటూ మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు..

## భారీగా తరలిరండి

**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్ నాయకులతో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ జూమ్ మీటింగ్ నిర్వహించారు ప్రజాపాలన విజయోత్సవాల లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం సచివాలయంలో తెలంగాణ తల్లీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉందని ఈ సభకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్ లతో జూమ్ సమావేశంలో మాట్లాడారు. ఏడాదిలో కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందని, మెజారిటీ ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఏడాది పాలనపై ప్రభుత్వం చేసిన సభలకి ప్రజలు లక్షలాదిగా తరలి వచ్చారని అన్నారు. ముగింపు ఉత్సవాలలో భాగంగా సచివాలయం వద్ద సాయంత్రం 4 గంటలకు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ఉంటుందని ఆ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు


### అయ్యప్ప మహా పడిపూజ..

# మహోజ్వలం

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ

### 24 ఏళ్లుగా నిర్వహిస్తున్న కిషన్ రెడ్డి దంపతులు

**హైదరాబాద్, మహా** : కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ నేత్రపర్వంగా జరిగింది. భక్తుల అయ్యప్ప శరణు ఘోషతో ప్రాంగణం పరిసరాలు మార్మోగాయి. అయ్యప్ప స్వామి మాలధారులు భజనలతో హోరెత్తించారు. మణికంఠుని నామస్మరణతో రంగురంగుల పూలతో 18 మెట్లను సుందరంగా అలంకరించి పడి వెలిగించారు. అనంతరం హరిహరసుతునికి అభిషేకం నిర్వహించారు. ఈ మహోత్సవానికి సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచే కాకుండా నగర వ్యాప్తంగా పెద్ద మొత్తంలో అయ్యప్ప మాలధారులు తరలివచ్చారు. మాల ధారణ ప్రాముఖ్యతను గురు స్వాములు వివరించారు. పడి పూజలో చేపట్టిన అభిషేక ఘట్టం కమనీయంగా కొనసాగింది. హరిహరసుతుడు అయ్యప్పస్వామికి భక్తి శ్రద్ధలతో శాస్త్ర ప్రకారం నిర్వహించే పూజలు, అర్చనలు హైందవ సంప్రదాయానికి ప్రతీకలు. అత్యంత పవిత్రమైన ఈ వేడుకను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దంపతులు 24 ఏళ్లుగా ఏటా నిర్వహిస్తున్నారు. అయ్యప్ప దీక్ష మతసామరస్యానికి ప్రతీక. కులం, మతం, చిన్న, పెద్దా తేడా లేకుండా ప్రతి వ్యక్తిని దైవ స్వరూపంగా భావించడమే దీక్ష పరమార్థం. దీని ద్వారా ఆధ్యాత్మిక చింతన పెరగడమే కాకుండా దురలవాట్లకు దూరమై, సంపూర్ణ ఆరోగ్యం, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవడుతుంది. అయ్యప్ప దీక్ష తీసుకున్న వారు కఠిన నియమాలు ఆచరిస్తూ దీక్షా కాలాన్ని పరిపూర్ణం గావిస్తారనే మంచి పేరుంది. ఏటేటా అయ్యప్ప దీక్ష తీసుకునే స్వాముల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అంతటి మహోన్నతమైన



దీక్షలో భాగంగా సాంప్రదాయ విశ్వాసం ప్రకారం అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని ప్రతిఏటా కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బీజేపీ ఎంపీ లు ఎమ్మెల్యే లతో పాటు బీజేపీ నేతలు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు అయ్యప్ప నామస్మరణతో ప్రాంగణం మార్మోగింది. ఈసందర్భంగా అయ్యప్పస్వామి అభిషేక కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. పూజారి ఆత్రేయ ఆధ్వర్యంలో అభిషేకం మంత్రోచ్చరణలతో ఆలయ ప్రాంగణం అయ్యప్ప శరణుఘోషతో మార్మోగింది. జడల రమేష్ ఆధ్వర్యంలో భక్త సంద్రంలో ముంచిన భజన గీతాలహరి భక్తులను అలరించింది. ఈ పూజ కార్యక్రమంలో ఎంపీలు రఘునందన్ రావు, ఈటల రాజేందర్, డీకే అరుణ, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, దన్ పాల్ సూర్యనారాయణ రాకేష్ రెడ్డితో పాటు పలువురు బీజేపీ రాష్ట్ర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విమానయాన భద్రతకు క్వాలిటీ కంట్రోల్ యూనిట్ ప్రారంభించిన సీఐఎస్ఎఫ్

**మహా :** అంతర్గత నాణ్యతా నియంత్రణ విభాగం (ఐక్యూసీయూ) ఏర్పాటు చేసి, దేశంలోని 68 విమానాశ్రయాల్లో విమానయాన భద్రతా దళం (ఏఎస్‌జీ) అందించే భద్రతను మెరుగుపరిచేందుకు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం కీలకమైన ముందడుగు వేసింది. ప్రపంచ స్థాయి భద్రతా విధానాలు, సాంకేతికతలను రూపొందించడంలో ఇందులో ఐక్యూసీయూ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సంస్థ పౌర విమానయాన భద్రతా సంస్థ (బీసీఏఎస్) జారీ చేసిన జాతీయ పౌర విమానయాన భద్రత నాణ్యతా నియంత్రణ కార్యక్రమం 2024 (ఎన్‌సీఏఎస్‌క్యూసీపీ), ఎయిర్ క్రాఫ్ట్ (భద్రత) నియమాలు 2023కి అనుగుణంగా పనిచేస్తుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా జులై 22, 2023న ప్రారంభించిన విమానయాన భద్రతా నియంత్రణా కేంద్రం (ఏఎస్‌సీసీ)లో ఐక్యూసీయూ అంతర్భాగంగా ఉంటుంది. ప్రమాద నిర్వహణ కేంద్రం (ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ సెంటర్), విమానయాన పరిశోధన, సమాచార కేంద్రం, కేంద్రీకృత సమాచార నియంత్రణ కేంద్రం లాంటి అధునాతన విభాగాలతో భారత విమానాశ్రయాల్లో భద్రతాపరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి, భద్రతా వ్యవస్థను మెరుగుపరచడానికి ఐక్యూసీయూతో ఏఎస్‌సీసీ కలసి పని చేస్తుంది. ఈ వ్యవస్థ ప్రాంతీయ అనుసంధాన పథకం (ఉడాన్) ద్వారా విమానాశ్రయాలకు భద్రత అందిస్తుంది. ధ్రువీకరణ పొందిన విమానయాన భద్రత (ఏవీఎస్ఈసీ) బోధకులు, జాతీయ ఆడిటర్లు, అనుభవజ్ఞులైన సిబ్బందితో కూడిన బృందానికి ఐక్యూసీయూకి సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారి నాయకత్వం వహిస్తారు.

**విధానాల ప్రామాణీకరణ**

ప్రామాణిక శిక్షణ, మూల్యాంకన పద్ధతుల ద్వారా అన్ని విమానాశ్రయాల్లో పాటించే భద్రతా విధానాల్లో ఏకరూపతను నిర్ధారించడం.

**సాంకేతిక అభివృద్ధి**

క్షేత్ర స్థాయి ప్రయత్నాలు, అంతర్జాతీయ స్థాయిలో పాటిస్తున్న ఉత్తమ విధానాల ఆధారంగా కొత్త సాంకేతికతల వినియోగాన్ని సూచించడం.

**అంతర్గత తనిఖీలు**

భద్రతా కార్యకలాపాలను అంచనా వేయడానికి, దిద్దుబాటు చర్యలను అమలు చేయడానికి ఐసీఏవో/ బీసీఏఎస్ మార్గదర్శకాల ఆధారంగా అంతర్గత తనిఖీలు, ఆడిట్‌లను నిర్వహించడం.


**నాణ్యతా ప్రమాణాల పర్యవేక్షణ**

పర్యవేక్షణ, సమీక్షించడం ద్వారా నిర్దేశించిన ప్రమాణాలను చేరుకోవడానికి, వాటిని సక్రమంగా అమలు చేసేందుకు, సాంకేతిక ప్రభావాన్ని, నిర్వహణా సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు భద్రతా విధివిధానాలను ఆధునికీకరించడం

**అభిప్రాయ విశ్లేషణ**

అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసీఏవో), బీసీఏఎస్, ఎన్‌సీఏఎస్ క్యూసీపీ ప్రమాణాలకు అనుగుణంగా లోపాలను గుర్తించి, పనితీరును మెరుగుపరిచేందుకు ఏఎస్‌జీల నుంచి అభిప్రాయాలను సేకరించి, విశ్లేషించడం.భద్రతా కార్యకలాపాల ప్రభావాన్ని పెంపొందించడానికి, ప్రమాదాలను తగ్గించడానికి, పటిష్టమైన, స్థిరంగా ఉండే విమానయాన భద్రతా వ్యవస్థను నిర్వహించడానికి సీఐఎస్ఎఫ్ కట్టుబడి ఉంది.

# గవర్నెన్స్ తక్కువ గాసిప్స్ ఎక్కువ



- ఫోన్ ట్యాపింగ్, ధరణి స్కామ్ అంటూ కాంగ్రెస్ వాళ్లు టైంపాస్ చేస్తున్నారు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ సెటైర్లు

**మహా:** కాంగ్రెస్‌కు గవర్నెన్స్ తక్కువ.. గాసిప్స్ ఎక్కువ అని మాజీమంత్రి కేటీఆర్ విమర్శించారు. కొన్నాళ్లు ఫోన్ ట్యాపింగ్, కొన్నాళ్లు ధరణి స్కామ్ అంటూ కాంగ్రెస్ వాళ్లు టైంపాస్ చేస్తున్నారని సెటైర్ వేశారు. రేవంత్ నోరే ఆయనకు శాపమని విమర్శించారు. పొంగులేటిపై ఈడీ రైడ్స్ లెక్కలు ఎందుకు బయటకురాలేదని ప్రశ్నించారు.

# అర్బన్ నక్సల్ ప్రభుత్వ వ్యాఖ్యలతో ఏకీభవించను

- కుటుంబం కోసమే కేసీఆర్.. దేశం కోసం మోడీ
- వ్యక్తిగత ఇమేజ్ కోసం రేవంత్ తహతహ
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



**మహా** : ప్రజామోదం లభించేలా ఆయన పాలన లేదని బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రేవంత్ వ్యక్తిగత ఇమేజ్ కోసం తహతహలాడుతున్నారన్నారు . కాంగ్రెస్ ఏడాది పాలనలో ఆరు మోసాలు, అరవైఆరు అబద్దాలని విరుచుకుపడ్డారు. కేసీఆర్ కుటంబం కోసం పనిచేశారన్న విమర్శలు వచ్చాయని, మోడీకి ప్రజలే కుటుంబమన్నారు. మోదీ ప్రతీక్షణం దేశం కోసమే ఆలోచిస్తారన్నారు. తెలంగాణలో అర్బన్ నక్సలైట్లతో కూడిన ప్రభుత్వం ఉందన్న బీజేపీ నేతల ఆరోపణలతో తాను ఏకీభవించడం లేదన్నారు.

EDITORIAL
ఎడిటోరియల్

# కేసీఆర్‌ను ఓవర్ టేక్ చేసిన రేవంత్

**కేసీఆర్ సహా బిఆర్ఎస్ నాయకులు రేవంత్ పై నరనరాన 'శత్రుత్వం' పెంచుకున్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం 'తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి' గానే కేసీఆర్ ను ట్రీట్ చేస్తున్నారు. అందుకే 'రణనీతి' కన్నా 'రాజనీతి'ని ఆయన ప్రదర్శిస్తున్నారు. రేవంత్ రెడ్డి 'రాజనీతి'మెళకువలకు కాకలు తీరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం ఆశ్చర్యపోతున్నారు.**



**"మీ వేగం గాలితో సమానంగా,మీ దృఢత్వం అడవితో సమానంగా ఉండాలి" అని క్రీస్తు పూర్వం 3 వ శతాబ్దానికి చెందిన యుద్ధరంగ నిపుణుడు సుంజు 'ద ఆర్ట్ ఆఫ్ వార్' లో చెప్పాడు.తన రాజకీయ ప్రత్యర్థులను చెండాడుతున్న రేవంత్ రెడ్డిలో గాలితో సరితూగే వేగమూ,అడవి వలె ధృఢత్వమూ కనిపిస్తోంది.**



**- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్**

కేసీఆర్ అనే మొక్కను మళ్ళీ మొలకెత్తనివ్వనని అన్నా,తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు హాజరు కావలసిందిగా మంత్రి పొన్నంతో రాయబారం నడిపినా,రాష్ట్రాభివృద్ధికి తన నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవంతో సూచనలు చేయాలని నల్లగొండ సభావేదిక నుంచి కేసీఆర్ ను కోరినా... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే చెల్లింది.కేసీఆర్ సహా బిఆర్ఎస్ నాయకులు రేవంత్ పై నరనరాన 'శత్రుత్వం' పెంచుకున్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం 'తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి' గానే కేసీఆర్ ను ట్రీట్ చేస్తున్నారు. అందుకే 'రణనీతి' కన్నా 'రాజనీతి'ని ఆయన ప్రదర్శిస్తున్నారు. రేవంత్ రెడ్డి 'రాజనీతి'మెళకువలకు కాకలు తీరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం ఆశ్చర్యపోతున్నారు. ఒక్క ఏడాదిలోనే ముఖ్యమంత్రిగా పార్టీ పరంగా,పరిపాలనాపరంగా చూపుతున్న 'వేగం' ఎవరికీ అంతు చిక్కకుండా ఉన్నది. ''మీ వేగం గాలితో సమానంగా,మీ దృఢత్వం అడవితో సమానంగా ఉండాలి'' అని క్రీస్తు పూర్వం 3 వ శతాబ్దానికి చెందిన యుద్ధరంగ నిపుణుడు సుంజు 'ద ఆర్ట్ ఆఫ్ వార్' లో చెప్పాడు.తన రాజకీయ ప్రత్యర్థులను చెండాడుతున్న రేవంత్ రెడ్డిలో గాలితో సరితూగే వేగమూ,అడవి వలె ధృఢత్వమూ కనిపిస్తోంది.

'కేసీఆర్ ఆనవాళ్లను తుడిచిపారవేయడానికి' కొంత సమయం పట్టవచ్చునేమో గానీ, కేసీఆర్ ను వెనక్కి నెట్టి రేవంత్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ రాజకీయంలో అత్యంత వేగంగా ముందుకు దూసుకు వెడుతున్నారు. రేవంత్ కేంద్రంగానే తెలంగాణ కార్యకలాపాలు నడుస్తున్నవి. ఇది అరుదైన సన్నివేశం. అతి తక్కువకాలంలోనే ఇది ఎలా సాధ్యమైందన్న అంశం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తున్నది. బిఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఫార్మ్ హౌజ్ నుంచే పార్టీని నడుపుతుండడం ముఖ్యమంత్రి రేవంత్ కు కలిసొచ్చిన అంశం. ఏడాది కాలంగా తెలంగాణ రాజకీయాలకు రేవంత్ రెడ్డి కేంద్రబిందువుగా మారారు. ఆయన తన చుట్టే తెలంగాణ రాజకీయాన్ని తిరిగేలా చేసుకోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. రాజకీయ ఉద్ధండుడు,జగజ్జెట్టీ అయినా కేసీఆర్ ను మరిపించడం అంత సులభం కాదు. అయితే ప్రజలు కేసీఆర్ ను మరచిపోయేలా అత్యంత వేగంగా రేవంత్ రెడ్డి కార్యాచరణ ఉంటున్నది.

**రేవంత్ రాజకీయాల్లో కాకలు తీరిన నాయకుడు కాకపోవచ్చు. కొన్ని సంఘటనల్లో సత్సంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. తుంటి ఎముక విరిగి యశోద ఆస్పత్రిలో చికిత్స పొందున్నప్పడు రేవంత్ రెడ్డి వెళ్లి కేసీఆర్ ను పరామర్శించారు. ఇప్పడు అసెంబ్లీ సమావేశాలకు ప్రధాన ప్రతిపక్ష నాయకున్ని ఆహ్వానించారు. ఇలాంటి సన్నివేశాలు సీఎం రేవంత్ ఇమేజ్ ను పెంచుతున్నవి.**

''బడికి ఎగ్గొట్టే వారిని చూసి ఉంటాము.కానీ ప్రజలు ఇచ్చిన బాధ్యతను కూడా మరిచి అసెంబ్లీకి రాని వారిని తెలంగాణ రాష్ట్రంలో చూస్తున్నాం.అసెంబ్లీకి రావాలని మేము పదేపదే కోరాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ సమాజం కేసీఆర్ ను ఎప్పుడో మరిచిపోయింది'' అని ముఖ్యమంత్రి రేవంత్ ఇదివరకు ఒక సందర్భంలో చెప్పారు.''కలిసి పనిచేద్దాం రండి! మా మంత్రి పొన్నం ప్రభాకర్ తో ఆహ్వానం పంపుతున్న. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కండి''! అని రేవంత్ డిసెంబర్ 5 న కేసీఆర్ కు పిలుపునిచ్చారు.దీనిపై కేసీఆర్ స్పందన ఎలా ఉంటుందో చూడాలి.

రేవంత్ రాజకీయాల్లో కాకలు తీరిన నాయకుడు కాకపోవచ్చు. కొన్ని సంఘటనల్లో సత్సంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. తుంటి ఎముక విరిగి యశోద ఆస్పత్రిలో చికిత్స పొందున్నప్పుడు రేవంత్ రెడ్డి వెళ్లి కేసీఆర్ ను పరామర్శించారు.ఇప్పుడు అసెంబ్లీ సమావేశాలకు ప్రధాన ప్రతిపక్ష నాయకున్ని ఆహ్వానించారు. ఇలాంటి సన్నివేశాలు సీఎం రేవంత్ ఇమేజ్ ను పెంచుతున్నవి. ఒకవైపు 'కేసీఆర్ ను జనం మరచిపోయార'ని అంటూనే ఆయనను అసెంబ్లీకి పిలవడం ఖచ్చితంగా రాజకీయ పరిణతికి ఉదాహరణగా నిలుస్తుంది.

రేవంత్ రెడ్డి పరిపాలన అద్భుతంగా ఉందో,లేదో ప్రజలు నిర్ణయిస్తారు.కానీ కేసీఆర్ చేయలేని పనులను రేవంత్ ఎలా చేయగలుగుతున్నారన్నదే హాట్ టాపిక్. కేసీఆర్ వలె పది రూపాయల పని చేసి పది కోట్ల పనులు చేసినట్టుగా,పబ్లిసిటీకి ప్రాధాన్యం ఇవ్వకుండా రేవంత్ రెడ్డి 'ఫోకస్డ్' గా వెళ్తున్నారు. తమ ప్రభుత్వ ఎజెండా 'విద్య,వైద్యం' అని స్పష్టంగా చెప్పారు. ఆ దిశగానే ఆయన అడుగులు పడుతున్నవి. కేసీఆర్ హయాంలో కేజీ టు పీజీ విద్య ఉచితంగా అందించే హామీ అమలు కాలేదు. రేవంత్ రెడ్డి జిల్లాకొక ఇంటిగ్రేటెడ్ స్కూళ్ళు ఏర్పాటు చేస్తున్నారు.ఖాయిలా పడిన ఐటిఐలకు జీవం పోసి వాటిని మరింత అధునాతనంగా మార్చనున్నారు. నాలెడ్జ్ సెంటర్లుగా అవి ఆవిర్భవించనున్నవి.'బంగారు తెలంగాణ'లో విద్యా కమిషన్,రైతు కమిషన్ వంటివి కేసీఆర్ ఏర్పాటు చేయలేకపోయారు.రేవంత్ ఆ పని చేసి పలు వర్గాల మన్ననలు పొందుతున్నారు.

స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్న ఆలోచన కేసీఆర్ ప్రభుత్వం చేయలేదు. సామాన్య ప్రజలు రెండు విషయాల్లో అప్పుల పాలయి ఇళ్ళు, పొలాలు అమ్ముకుంటారు.అవే విద్య, వైద్య రంగాలు .ఆ రంగాలను పునరుద్ధరించగలిగి,ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందించగలిగితే అంతకన్నా గొప్ప విషయం ఏమీ ఉండదు.అందులో విజయం సాధిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళ్ళు కడిగి ఆ నీళ్లు నెత్తిన చల్లుకుంటారు.ఏయే హామీలను అయితే కేసీఆర్ ప్రభుత్వం అమలు చేయలేదో సరిగా అక్కడే ముఖ్యమంత్రి 'సర్జికల్ స్ట్రైక్' చేస్తున్నారు.2 లక్షల రూపాయల రుణమాఫీ అలాంటిదే.అలాగే హైదరాబాద్,వరంగల్ వంటి నగరాలకు భారీగా నిధులు ఖర్చు చేయనున్నారు.

రేవంత్ దేనికీ వెరవకుండా సై అంటే సై అంటూ,ఏ విషయం మీదైనా సరే అనర్గళంగా తెలంగాణ సామెతలతో చెణుకులు విసురుతూ మాట్లాడుతున్నారు. చేతిలో పేపర్ లేకుండా,ఎలాంటి నోట్స్ లేకుండా దాదాపు గంటకు పైగా అన్ని రంగాల గురించి,అన్ని వర్గాల గురించి సాధికారికంగా ప్రసంగించాలంటే చాలా హోమ్ వర్క్ జరగాలి. విషయాల పట్ల సంపూర్ణ అవగాహన ఉండాలి. తడబడకుండా మాట్లాడాలి. అదీ కాకుండా తన సహచర మంత్రులందరినీ కలుపుకొని పోతున్నట్టుగా దృశ్యాలు కనిపిస్తున్నవి. దాదాపు పదేండ్ల కేసీఆర్ హయాంలో మంత్రులతో కలిసి పాల్గొన్న కార్యక్రమాలు అరుదు. అలాగే సభావేదికపై కేసీఆర్ ఒక్కరే మాట్లాడే సంప్రదాయం కొనసాగింది. అందుకు భిన్నంగా 'ప్రజాప్రభుత్వం' ఉంటుందని రుజువు చేయడానికి సీఎం ప్రయత్నిస్తున్నారు.

రెండు సార్లు కేసీఆర్ కు అధికారం కట్టబెట్టిన ప్రజలు ,మూడోసారి ఎందుకు తిరస్కరించారు? బీఆర్ఎస్ నాయకత్వం కింద కేడర్ ను పట్టించుకోకపోవడం,నియంతల్లా వ్యవహరించడం లాంటి కారణాలపై పలు విశ్లేషణలున్నవి.బీఆర్ఎస్ పట్ల కింది స్థాయిలో అసంతృప్తిని పసిగట్టిన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి దానినే తమ అస్త్రంగా మలచుకున్నారు.

**జవసత్వాలుడిగిన కాంగ్రెస్ పార్టీకి ఊపిరులూది అన్నీ తానై నడిపించారు.బీఆర్ఎస్ అదృష్టమేమిటంటే ఆ పార్టీలో వాక్చాతుర్యం,రాజకీయ చతురత ఉన్న కేటీఆర్, హరీష్ రావు లాంటి నాయకులున్నారు. తాము చేసిన పొరపాట్లను నిష్పక్షపాతంగా విశ్లేషించుకొని,తప్పులను సరిదిద్దుకొని కింది స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తే బీఆర్ఎస్ పునర్వైభవాన్ని సంతరించుకోవచ్చు.ఈ ఫార్ములా కేవలం బిఆర్ఎస్ కే కాదు,ఎవరికైనా వర్తిస్తుంది.అలా చెయ్యకపోతే ఎప్పడో పార్టీ ఆవిర్భావం వేళ తీసుకున్న నిర్ణయాలు,అధికారంలోకి వచ్చాక చేసిన పొరబాట్లు... అలాగే కొనసాగిస్తే కమ్యూనిస్టు పార్టీల వలె తెరమరుగు అయ్యే అవకాశం ఉన్నది.**

''ప్రజాక్షేత్రంలో,ప్రజాస్వామ్యంలో ప్రజలు ఏం కోరుకుంటే అది జరుగుతుంది.వారు ఎవరిని ఎన్నుకుంటే వారే ప్రభుత్వాన్ని నడుపుతారు. ఏ రాజకీయ పార్టీ అయినా తన సొంత బలంతోనే ఎన్నికల్లో గెలుస్తుంది.2014, 2018లలో మాకు వ్యూహకర్తలు ఎవరూ లేరు. కేసీఆర్‌ను మించిన వ్యూహకర్తలు లేరు. టీఆర్ఎస్ పాలన బాగాలేదు అని ప్రజలు భావిస్తే మమ్మల్ని ఎవరూ కాపాడలేరు. ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి కన్నా నేనే పెద్ద అని ఎవరైనా అనుకుంటే అది వారి అమాయకత్వం అవుతుంది.అవివేకం అవుతుంది''.అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొన్నేళ్ల కిందట ఒక జాతీయ మీడియాకు చెప్పారు.

అధికారం కోల్పోయాక ఆయన అన్నీ మరచిపోయారు.''అధికారంలో మీరు ఉండవచ్చు,కానీ ప్రజాభిమానం మా వెంటే ఉన్నది'' అని యిటవల పలు సందర్భాల్లో కేటీఆర్ అన్నారు. అధికారం,ప్రజాభిమానం... నాణానికి రెండు ముఖాలు. ప్రజాభిమానం లేనందుకే బిఆర్ఎస్ ఇంటికి వెళ్ళింది.అధికారం కాంగ్రెస్ చేతుల్లోకి వచ్చింది. కేటీఆర్ మాటల్లోనే చెప్పాలంటే 'మా పాలన బాగాలేకపోతే మమ్మల్ని ఎవరూ కాపాడలేరు' అన్నదీ నిజమే. కేసీఆర్ పాలన బాగా లేదని ప్రజలు నిర్ధారించుకున్న తర్వాతే కాంగ్రెస్ కు విజయం కట్టబెట్టారు.'ముఖ్యమంత్రి కన్నా నేనే గొప్ప అనుకుంటే అమాయకత్వం కాగలదు' అని తాను చేసిన వ్యాఖ్యలకు పూర్తి విరుద్ధంగా వ్యహరిస్తున్నారు. రేవంత్ రెడ్డి పరిపాలన పిచ్చివాడి చేతిలో రాయిలా మారిందనో,ఆయన ఒక మూర్ఖుడనో,అజ్ఞాని అనో,చదువు రాదనో... ఇష్టమొచ్చినట్టు కేటీఆర్ చేస్తున్న ప్రకటనలను ఎలా అర్థం చేసుకోవాలి.ఆయన మాటల్లో తమ అధికారాన్ని రేవంత్ రెడ్డి గుంజుకున్నారన్న ఆక్రోశం,ఆగ్రహం కనిపిస్తోంది.

''చాలామంది పోయింద్రు చరిత్రల.పెద్ద పెద్ద హిట్లర్లు ,ముసోలియన్లు,నెపోలియన్లు..అందరూ పోయింరు. అధికారం నెత్తికెక్కి పిచ్చి పిచ్చి మాట్లాడితే సమాధానం కాలం చెబుతుంది.దేవుడు కూడా కాపాడడు'' అని గతంలో కేసీఆర్ అన్నారు.అసెంబ్లీ ఫలితాలు తమకు వ్యతిరేకంగా వచ్చిన సమయంలో 19 సెకన్ల వీడియో ఒకటి అప్పట్లో వైరల్ అయ్యింది. ప్రజలిచ్చిన అధికారాన్ని విచ్చలవిడిగా దుర్వినియోగం చేసిందనడానికి ఎన్నో సాక్ష్యాలు ఇప్పుడు బయటకు వస్తున్నవి. ప్రజలకు అందుబాటులోకి లేకుండా పోవడం కేసీఆర్ ప్రభుత్వానికి చెడ్డపేరును తీసుకొచ్చింది.

**తెలంగాణ వచ్చి పదేళ్లయ్యాక కూడా ఇంకా 'దీక్షా దివస్' లు నిర్వహించడం,కేసీఆర్ చావు నోట్లోకి పోయి వస్తేనే తెలంగాణ ఏర్పడిందనే సానుభూతి 'మార్కెటింగ్' ముందు,ఎవరి మార్కెటింగు పనికిరాదు. పైగా ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్న సమయంలో "ఆయన ప్రజల్ని కలవాల్సిన అవసరం ఏమిటి? ప్రజలకేమి కావాలో అన్నీ సమకూర్చి పెడుతున్నప్పడు,ప్రజల్ని సీఎం కలవడం లేదంటూ దుష్ప్రచారం చేస్తున్నారు."అని కేటీఆర్ గతంలో కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. అంటే ఒకవేళ 'తాను ముఖ్యమంత్రి అయినా అంతే' అని ప్రజలు కేటీఆర్ ను అర్థం చేసుకుంటున్నారు.**

అధికారం మత్తు వల్ల తనలోని లోపాన్ని గుర్తించేందుకు ఇప్పటికీ కేసీఆర్ అంగీకరించలేదు.పార్టీ ఓడిన తర్వాత కూడా ఆయన తనతప్పును దిద్దుకునే ప్రయత్నం చేయడం లేదని ఆ పార్టీ కార్యకర్తలే అంటున్నారు. జరిగిన తప్పుల్ని ఒప్పుకొని, పొరపాట్లను అంగీకరించి,ప్రజలతీర్పును తాను గౌరవిస్తున్నట్లుగా కేసీఆర్ చెప్పలేకపోతున్నారు. ఎన్నికల్లో పార్టీ ఓడిన నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడానికి సంప్రదాయం ప్రకారం రాజ్ భవన్ కు వెళ్లి గవర్నర్ కు రాజీనామా పత్రాన్ని ఇస్తుంటారు. అందుకు భిన్నంగా ప్రత్యేక దూత ద్వారా రాజీనామా పత్రాన్ని గవర్నర్ కు పంపటం దేనికి నిదర్శనం?

ప్రజల తీర్పును శిరసావహిస్తున్నట్టుగా కేసీఆర్,కేటీఆర్ నోటి నుంచి మాటలు వచ్చాయా? తాను పోటీ చేసిన రెండు స్థానాల్లో కామారెడ్డిలో స్వయంగా ఓటమిపాలు కావటం కేసీఆర్ కు బిగ్ షాక్.తనకు తాను 'తెలంగాణ బాపు'గా చెప్పుకునే కేసీఆర్ ను తిరస్కరించటం అది పెద్ద ఓటమిగా.పార్టీ అధికారం పోగొట్టుకున్న బాధ కన్నా,కామారెడ్డిలో ఓటమి ఘోర పరాభవం. కామారెడ్డి ప్రజలకు కృతజ్ఞతలు చెప్పి,మీ మనసుల్ని గెలుచుకోవటానికి మరోసారి ప్రయత్నిస్తానని చెప్పడానికి కేసీఆర్ ఇష్టపడడం లేదు.ఒకవేళ.. కేసీఆర్ నోటి నుంచి ఈ మాటలే వచ్చి ఉంటే అయ్యో.. సారును ఓడించి తప్పు చేశామే అన్న భావన కొందరిలో అయినా కలిగేదేమో!. కానీ అదేమీ లేకుండా తన దారిన తాను ఫామ్ హౌస్ కు వెళ్లటాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.

**తెలంగాణ సాధనలో తన గురించి తాను గొప్పగా చెప్పకోవటం,తాను లేకుంటే తెలంగాణ వచ్చేదే కాదు. తాను తప్పించి మరెవరూ గొప్ప కాదన్న అహంభావాన్నికేసీఆర్ ప్రదర్శిస్తూ ఉంటారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తెలంగాణ ఏర్పాటు పట్ల 'కమిట్ మెంటు' తో లేకపోతే రాష్ట్ర కల సాకారమయ్యేదే కాదు.అయితే కేసీఆర్ 'మార్కెటింగ్' నైపుణ్యం ముందు,కాంగ్రెస్ తెలంగాణ నాయకులు ఎందుకూ పనికిరారు.కేసీఆర్ ఏమి చెప్పినా గోడకట్టినట్టు చెబుతారు.ప్రజల్ని సులభంగా బోల్తా కొట్టించగలరు.**

తెలంగాణ వచ్చి పదేళ్లయ్యాక కూడా ఇంకా 'దీక్షా దివస్' లు నిర్వహించడం,కేసీఆర్ చావు నోట్లోకి పోయి వస్తేనే తెలంగాణ ఏర్పడిందనే సానుభూతి 'మార్కెటింగ్' ముందు,ఎవరి మార్కెటింగు పనికిరాదు.పైగా ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్న సమయంలో ''ఆయన ప్రజల్ని కలవాల్సిన అవసరం ఏమిటి? ప్రజలకేమి కావాలో అన్నీ సమకూర్చి పెడుతున్నప్పుడు,ప్రజల్ని సీఎం కలవడం లేదంటూ దుష్ప్రచారం చేస్తున్నారు.''అని కేటీఆర్ గతంలో కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు.అంటే ఒకవేళ 'తాను ముఖ్యమంత్రి అయినా అంతే' అని ప్రజలు కేటీఆర్ ను అర్థం చేసుకుంటున్నారు.

ప్రజల్ని అక్కున చేర్చుకొని,వాండ్ల మనసు గెల్చుకొని,వచ్చే ఎన్నికల్లో తమకు అనుకూలమైన తీర్పు కోసం శ్రమించాలన్న ఆలోచనలో కేసీఆర్,కేటీఆర్ లేరు. 'ఈ 11 నెలల్లోనే ప్రజలు చాలా కోల్పోయారు.వాళ్లకు ఇప్పుడు తెలిసొచ్చింది.కాంగ్రెస్ బూటకపు హామీలకు మోసపోయారు.గోసపడుతున్నారు.కేసీఆర్ మళ్ళీ అధికారంలోకి రావాల్సిందేనని ప్రజలు కోరుతున్నారు'అంటూ బిఆర్ఎస్ నాయకులు జరుపుతున్న ప్రచారం పెద్దగా 'కిక్కు' నివ్వడం లేదు. ఈ ప్రచారం వర్కవుటవుతుందని జనం భావించడం లేదు.

# నేటి నుండి అసెంబ్లీ

మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీ సమావేశాలకు సంబంధించి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మొదటి రోజు తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణపై అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేయనున్నారు. సభలో ఏడు చట్ట సవరణ బిల్లులను ప్రభుత్వంప్రవేశపెట్టనుంది.ఈ సమావేశాల్లో రెండు కొత్త బిల్లులను ప్రవేశపెట్టనున్నారు. పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు, రికార్డ్స్ ఆఫ్ రైట్స్(ఆర్వోఆర్) బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. గతంలో ఇద్దరు వరకు సంతానం ఉన్నవారికి మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉండేది. అయితే ప్రభుత్వం దీనిని సవరించి ముగ్గురి సంతానం ఉన్నా పోటీ చేసే అవకాశం కల్పించబోతోంది.

**ఆర్వోఆర్ బిల్లు..**

దీనికి సంబంధించినదే పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు. అలాగే ప్రస్తుత రెవెన్యూ చట్టంలో మార్పులు చేసి, కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకొచ్చేందుకు ఆర్వోఆర్ బిల్లును సభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోనుంది. అలాగే ఇదివరకు ఉన్న గ్రామ సహాయకులు(వీఏవో), గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వో) తరహాలో ప్రభుత్వం ఒక కొత్త పోస్టును సృష్టించి, నియామకాలు చేయనుంది. సర్వీసులో ఉన్న కొంత మందిని, ప్రత్యక్ష ఎంపిక ద్వారా మరికొంత మందిని ఈ పోస్టుల్లో నియమించే అవకాశాలున్నాయి. ఇలాంటి అంశాలన్నీ ఆర్ఓఆర్ బిల్లులో ఉన్నాయి. ఈ కొత్త బిల్లులు కాకుండా మరో ఐదు ఆర్డినెన్స్‌లను సభలో ప్రవేశపెట్టి ఆమోదించనుంది.

**వీటిపైనే చర్చ**

ఈ సమావేశాల్లో రైతు భరోసా పథకంపై కీలక చర్చ జరగనుంది. దీని విధివిధానాలపై ఇప్పటికే ప్రభుత్వం ఒక ముసాయిదాను తయారు చేసింది. రైతు భరోసా సహాయాన్ని ఎన్ని ఎకరాలకు పరిమితం చేయాలి, ఎలాంటి భూములకు ఇవ్వాలి, కౌలు రైతుల సంగతి ఏమిటి? వంటిఅంశాలపై చర్చిస్తారు.

**ఏడాది సర్కార్**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తైన నేపథ్యంలో.. ఈ అసెంబ్లీ సమావేశాలు మరింత రసవత్తరంగా మారే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ఈ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన, రుణమాఫీ, హైడ్రా, మూసీ ప్రక్షాళన, రైతు భరోసా వంటి కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది. ఇక ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షం.. గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ కేసులు, లగచర్ల ఘటన, రైతు భరోసా, బోనస్ వంటి అంశాలపై చర్చకు పట్టుపట్టే అవకాశం కనిపిస్తోంది. వీటన్నింటికంటే మరో ముఖ్యమైన అంశం ఈ సమావేశాల్లో మరింత ఉత్కంఠ రేపనుంది.

**కేసీఆర్ వస్తారా..**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఒక్కసారి మాత్రమే అది కూడా ఒక్క రోజు మాత్రమే కేసీఆర్ సభకు హాజరయ్యారు. బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో అసెంబ్లీకి హాజరైన కేసీఆర్.. ఆ రోజు సమావేశం ముగియక ముందే వెళ్లిపోయారు. ఈ సారైనా అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారా.. లేదా.. అనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ప్రభుత్వ పెద్దల నుంచి రియాక్షన్ ఎలా ఉంటుందనేది మరింత ఆసక్తికరంగా మారింది. కేసీఆర్ వస్తారో రారో చూడండి అని బిఆర్ఎస్ నేతలు అంటున్నారు.

**సర్పంచ్ ఎన్నికలపై నిర్ణయం**

డిసెంబర్ 7వ తేదీతో రేవంత్ సర్కార్ ఏడాది కాలం పూర్తి చేసుకుంది. మరోవైపు పంచాయతీ ఎన్నికలపై కూడా గవర్నమెంట్ కసరత్తు చేస్తోందని తెలుస్తోంది. త్వరలో సర్పంచ్ ఎలక్షన్స్ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ తర్వాతే విస్తరణ ఉండే అవకాశాలున్నాయి.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp-
7436939999

చలికాలంలో మీ జుట్టు రాలుతూ

## అందవిహీనంగా మారిందా..?

అయితే ఈ చిట్కాలను పాటించండి..!

చలికాలంలో మనకు సహజంగానే చర్మ సమస్యలు వస్తుంటాయి. ముఖ్యంగా చర్మం పొడిబారి దురద పెడుతుంది. మృదుత్వాన్ని, తేమను కోల్పోతుంది. అలాగే ఈ సీజన్‌లో మనల్ని జుట్టు సమస్యలు కూడా ఇబ్బందులకు గురి చేస్తుంటాయి. జుట్టు చిట్లిపోతుంది. కాంతి హీనంగా మారుతుంది. అలాగే జుట్టు రాలడం ఇబ్బందులకు గురి చేస్తుంది. దీంతోపాటు చుండ్రు సమస్య కూడా మనల్ని ఇబ్బందులకు గురి చేస్తుంది. అయితే ఈ సీజన్‌లో లభించే ఉసిరికాయలతో అన్ని రకాల జుట్టు సమస్యలకు మనం చెక్ పెట్టవచ్చు. ఉసిరికాయలలో ఉండే పోషకాలు మన జుట్టును ఆరోగ్యంగా ఉంచుతాయి. ఉసిరికాయను పలు రకాలుగా వాడడం వల్ల జుట్టును ఈ సీజన్‌లో ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

**ఉసిరికాయ నూనె..**

మార్కెట్‌లో మనకు ఉసిరికాయ నూనె లభిస్తుంది. దీన్ని జుట్టుకు వాడవచ్చు. జుట్టుకు బాగా మర్దనా చేసి గంట సేపు అయ్యాక షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారంలో కనీసం 2 సార్లు చేస్తే ఫలితం ఉంటుంది. అయితే ఈ నూనెను జుట్టుకు రాత్రిపూట పట్టించి మరుసటి రోజు ఉదయం తలస్నానం చేస్తే ఇంకా ఎక్కువ ఫలితం ఉంటుంది. దీంతో జుట్టు కుదుళ్ల నుంచి దృఢంగా మారుతుంది. శిరోజాలు కాంతివంతంగా మారుతాయి. జుట్టు పొడవుగా, ఒత్తుగా పెరుగుతుంది. ఉసిరికాయ పొడిలో కాస్త పెరుగు కలిపి ఈ మిశ్రమాన్ని జుట్టుకు బాగా పట్టించాలి. జుట్టు కుదుళ్లకు తగిలేలా బాగా మర్దనా చేయాల్సి ఉంటుంది. అనంతరం 30 నిమిషాల పాటు ఆగి తలస్నానం చేయాలి. ఈ చిట్కాను వారంలో ఒకసారి పాటించాలి. దీంతో జుట్టుకు తేమ లభించి మృదువుగా మారుతుంది. చుండ్రు సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. శిరోజాలు ఒత్తుగా, పొడవుగా పెరుగుతాయి.

**ఉసిరికాయ జ్యూస్..**

జుట్టుకు షాంపూ పెట్టి తలస్నానం చేశాక జుట్టుకు ఉసిరికాయ జ్యూస్‌ను పట్టించాలి. తరువాత 5 నిమిషాల పాటు ఉండి కడిగేయాలి. ఇలా వారంలో ఒకసారి చేయాల్సి ఉంటుంది. దీంతో జుట్టు కుదుళ్ల దగ్గర పీహెచ్ స్థాయిలు సక్రమంగా ఉంటాయి. జుట్టు కాంతివంతంగా మారుతుంది. మృదువుగా ఉంటుంది. ఎండిన ఉసిరి కాయ ముక్కలను కొబ్బరినూనెలో వేసి నూనె సగం అయ్యే వరకు మరిగించాలి. దీంతో తయారయ్యే మిశ్రమాన్ని జుట్టుకు వారంలో 3 సార్లు పట్టించాలి. దీంతో జుట్టు రాలే సమస్య నుంచి బయట పడవచ్చు. శిరోజాలు ఒత్తుగా, పొడవుగా పెరుగుతాయి.

# నేతన్నలకూ రుణమాఫీ!

## రేవంత్ సర్కార్ కసరత్తు.. ఇక చేనేతలకు పండుగే..

ఆ దిశగా వడివడిగా అడుగులు

కార్మికులు, సంఘాల వారీగా రుణ జాబితా రెడీ

ఫైనాన్స్ డిపార్ట్‌మెంటుకు ఫైల్.. సైలెంట్‌గా ఒక్కొక్కటిగా అమలు



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికాలంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తోంది. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి మహాలక్ష్మి పథకాన్ని అందుబాటులోకి తీసుకురాగా, గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ను అందిస్తోంది. సర్కార్ 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ను, రైతులకు రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీని అందించి ప్రజాసంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం తమదని చెప్పే ప్రయత్నం చేస్తోంది. ఇక ఈ క్రమంలోనే తాజాగా మరో శుభవార్త చెప్పేందుకు తెలంగాణ సర్కార్ సిద్ధమైంది.

**చేనేతలకు శుభవార్తే..**

విజయోత్సవాలలో భాగంగా చేనేతలకు శుభవార్త చెబుతూ రేవంత్ ప్రభుత్వం చేనేత రుణమాఫీ పథకం అమలుకు రెడీ అయింది. దీనికోసం 58కోట్ల రూపాయలు అవసరమని గుర్తించిన ప్రభుత్వం నిధుల విడుదల కోసం ఆర్థిక శాఖకు ఫైల్ కూడా పంపించింది. చేనేతల రుణమాఫీ కోసం ఇప్పటికే చేనేత శాఖ ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించిన క్రమంలో ఆర్థికశాఖ నుండి త్వరలోనే చేనేతల రుణ మాఫీకి గ్రీన్ సిగ్నల్ వస్తుందని భావిస్తోంది.

**చేనేతలకు రుణమాఫీపై..**

ఈ ఏడాది సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జాతీయ చేనేత సాంకేతిక సంస్థ ప్రారంభోత్సవంలో చేనేత కార్మికులకు రుణాలను మాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు తాజాగా ప్రభుత్వం చేనేత శాఖ రుణమాఫీపై కసరత్తు చేపట్టింది. గత ప్రభుత్వం 2017 మార్చి 31 వరకు ఈ రుణమాఫీ అమలు చేసింది. 2017 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు.. రుణాలు పెండింగ్‌లో ఉండగా, ఆ రుణాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేయనుంది. ఇందుకు రూ.58 కోట్లు అవసరమని చేనేత శాఖ ప్రతిపాదనలు రూపొందించింది.

**అధికారుల పరిశీలన**

చేనేతల రుణమాఫీ ప్రక్రియను అధికారులు చేపట్టారు. చేనేత కార్మికులు, సంఘాలు, బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల నుంచి తీసుకున్న రుణ వివరాలను అన్ని జిల్లాల సహాయ సంచాలకుల నుంచి అధికారులు సేకరించారు. వీటిని పరిశీలించిన తర్వాత 7,250 మంది కార్మికులు.. రూ.40.10 కోట్ల అప్పులు, 91 చేనేత సహకార సంఘాలు రూ.18 కోట్ల అప్పులు చేసినట్లు అధికారులు గుర్తించారు.

**జాబితా రెడీ**

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా మొత్తంగా రుణమాఫీకి రూ.58.10 కోట్లు అవసరమని చేనేత శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కార్మికులు, సంఘాల వారీగా రుణ జాబితాను రెడీ చేసి, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు పంపారు. ఆర్థిక శాఖ ఆమోదం లభిస్తే వెంటనే రుణమాఫీ ప్రక్రియను చేనేత శాఖ చేపడుతుంది. త్వరలోనే ఈ ఆమోదం లభిస్తుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రుణం విడుదల కాగానే.. లబ్ధిదారుల అకౌంట్లకు మనీ జమ అవుతుంది. ఆ డబ్బుతో రుణాలను చెల్లించాల్సి ఉంటుంది.




### పప్పు దినుసులు..

మన శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే రోగాలు రాకుండా రక్షణ వ్యవస్థ నిరంతరాయంగా పనిచేయాలి. అయితే ఇలా రోగ నిరోధక వ్యవస్థ పనిచేసేందుకు గాను సెలీనియం ఎంతగానో దోహదపడుతుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మార్చి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతోపాటు థైరాయిడ్ పనితీరు మెరుగు పడుతుంది. అలాగే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌లా కూడా సెలీనియం పనిచేస్తుంది. అందువల్ల సెలీనియం అధికంగా ఉండే ఆహారాలను తరచూ తీసుకోవాలి. సెలీనియం మనకు ఎక్కువగా పప్పు దినుసుల్లో, చిక్కుడు జాతి గింజల్లో లభిస్తుంది. ముఖ్యంగా పప్పు దినుసులతోపాటు శనగలు, రాజ్మాను తినాలి. వీటిల్లో కేవలం సెలీనియం మాత్రమే కాదు ఫైబర్ కూడా సమృద్ధిగానే ఉంటుంది. ఇది మనల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

# థైరాయిడ్ సమస్యలు పోయి రోగ నిరోధక శక్తి పెరగాలంటే వీటిని తినాలి..!

**మనం ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని రకాల పోషకాలు కలిగిన ఆహారాలను తినాలనే విషయం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలోనే మనం రోజూ అన్ని పోషకాలు ఉన్న ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఆరోగ్యంగా ఉంటారు. అలాగే అనేక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. పోషకాహార లోపం తలెత్తకుండా ఉంటుంది. మనం ఆరోగ్యంగా ఉండాలంటే పలు మినరల్స్ అవసరం అవుతాయి. వాటిల్లో సెలీనియం కూడా ఒకటి. ఇది అనేక జీవక్రియలను నిర్వర్తిస్తుంది. సెలీనియం ఉన్న ఆహారాలను తరచూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. సెలీనియం వల్ల మన శరీరానికి ఏం జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.**

### చేపలు..

చేపల్లో సెలీనియం సమృద్ధిగా ఉంటుంది. కనుక వారంలో కనీసం 2 సార్లు అయినా సరే చేపలను తినాలి. ముఖ్యంగా సముద్రపు చేపలు, రొయ్యలు, పీతలు, ఆల్చిప్పలలో సెలీనియం సమృద్ధిగా ఉంటుంది. అలాగే వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. గుండె పనితీరును మెరుగు పరుస్తాయి. అనేక రోగాల బారి నుంచి మనల్ని రక్షిస్తాయి. కోడిగుడ్డులోని పచ్చ సొనలోనూ సెలీనియం సమృద్ధిగా ఉంటుంది. అందువల్ల సెలీనియం కోసం కోడిగుడ్లను కూడా తినవచ్చు.

### పొద్దు తిరుగుడు విత్తనాలు..

పొద్దు తిరుగుడు విత్తనాలను అధికంగా తీసుకోవడం వల్ల కూడా మనకు సెలీనియం లభిస్తుంది. వీటిల్లో విటమిన్ ఇ కూడా ఉంటుంది. అలాగే ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. వీటిని సాయంత్రం సమయంలో స్నాక్స్ రూపంలో తింటే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. బ్రౌన్ రైస్, ఓట్ మీల్, హోల్ వీట్ బ్రెడ్ వంటి వాటిల్లో సెలీనియం ఉంటుంది. అందువల్ల వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే సెలీనియం పొందవచ్చు. ఇవి మనకు చక్కని పోషణను అందిస్తాయి. చికెన్, మటన్ వంటి ఆహారాలను తీసుకోవడం వల్ల కూడా సెలీనియం లభిస్తుంది. వీటితో మనకు ప్రోటీన్లు కూడా లభిస్తాయి. కనుక ఆరోగ్యంగా ఉంటాము. శక్తి లభిస్తుంది. ఇలా పలు రకాల ఆహారాలను తరచూ తింటే సెలీనియం పొందవచ్చు. దీంతో అనేక వ్యాధుల నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చు. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.



వైజాగ్‌లో ఎఎన్ఎన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఏపీ మంత్రి నారా లోకేష్. వైజాగ్ సిటీ ఇన్ ఛార్జి సత్యనారాయణను అభినందించిన మంత్రి

## హైదరాబాద్‌లోని పలు చోట్ల వాన..



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లో వర్షం కురుస్తున్నది. ఆదివారం తెల్లవారుజాము నుంచే పలు చోట్ల వాన పడుతున్నది. అమీర్‌పేట, పంజాగుట్ట, ఖైరతాబాద్, బంజారాహిల్స్, ఎస్ఆర్ నగర్, బేగంపేట, కూకట్‌పల్లి, బాలానగర్, కుత్బుల్లాపూర్, మూసాపేట, నాంపల్లి, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ సహా పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తున్నది. నగరం మొత్తం మేఘావృతమై ఉన్నది. ఇక రాష్ట్రంలోని పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న ఈక్వటోరియల్ హిందూ మహా సముంద్రం మీదుగా ఉన్న ఆవర్తన ప్రభావంతో అల్పపీడనం ఏర్పడిందని ఐఎండీ తెలిపింది. ఆదివారం సాయంత్రానికి అది బలపడే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.



## రామప్పలో జవహర్ నవోదయ స్టూడెంట్స్ సందడి

**ములుగు, మహా :** వెంకటాపూర్ మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప టెంపుల్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా మామునూరు లో గల జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులతో ఆదివారం సందడిగా మారింది. 6 నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా టూర్ లో భాగంగా రామప్ప, లక్నవరం సందర్శించినట్లు ప్రిన్సిపాల్ పూర్ణిమ తెలిపారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు ,ఆశీర్వచనాలు వారికి అందజేశారు. అనంతరం టూరిజం గైడ్ విజయ్ ఆలయ చరిత్రను వారికి వివరించారు. వారి వెంట ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## షార్ట్ సర్క్యూట్ తో హార్వెస్టర్ దగ్ధం

### 25 లక్షల ఆస్తి నష్టం



**ములుగు, మహా :** షార్ట్ సర్క్యూట్ తో హార్వెస్టర్ దగ్ధమైన సంఘటన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం జవహర్ నగర్ గ్రామంలో ఆదివారం జరిగింది. లింగాపూర్ గ్రామానికి చెందిన బొమ్మిడి శ్రీనివాస్ కు చెందిన హార్వెస్టర్ జవహర్ నగర్ లోని గంప మహేందర్ పొలంలో పంటకోవడానికి వెళ్ళింది. పనిచేస్తున్న సందర్భంలోనే ఒకసారిగా ఇంజన్ నుండి మంటలు రావడంతో డ్రైవర్ రాజకుమార్ వెంటనే దిగి 100 కు కాల్ చేశారు. పక్కనే ఉన్న రైతులు బోరునీరు సహాయంతో మంటలు ఆర్పడానికి ప్రయత్నించారు. ఫైర్ ఇంజన్ వచ్చిన పొలాల్లోకి వెళ్ళకపోవడంతో రైతులు బోరు వాటర్ తో మంటలను చల్లారిచారు. 24 లక్షల విలువ గల హార్వెస్టర్ దగ్ధమవడంతో బొమ్మడి శ్రీనివాస్ కుటుంబ సభ్యుల బాధ వర్ణనాతీతమైంది. ప్రభుత్వం దయ తలిచి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

# బేల సూపర్ మార్కెట్ చోరీ కేసులో 8 మంది అరెస్ట్

## మధ్యప్రదేశ్‌కు చెందిన అంతరాష్ట్ర ముఠాగా గుర్తింపు

రెండు లక్షల 41 వేల నగదు స్వాధీనం


మీడియాకు కేసు వివరాలు వెల్లడించిన సీఐ సాయినాథ్



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా బేల మండలకేంద్రంలోని శ్రీకర్ సూపర్ మార్కెట్‌లో ఈనెల నాలుగవ తేదీన జరిగిన భారీ చోరీ కేసులో 8 మంది మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అంతరాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. స్వల్ప వ్యవధిలోనే ఈ కేసును చేధించి ఉన్నతాధికారుల అభినందనలు అందుకున్నారు బేల పోలీసులు. డిసెంబర్ 4 న బేల మండలకేంద్రంలోని శ్రీకర్ సూపర్ మార్కెట్‌లో ఐదు లక్షల ఎనభై ఏడు వేల నగదు దొంగతనం జరిగిన ఘటనలో సూపర్ మార్కెట్ యజమాని స్వరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బేల పోలీస్ స్టేషన్‌లో అదేరోజు కేసు నమోదైంది. ఘటన స్థలాన్ని జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్ఐ పురుషోత్తం, దివ్యభారతి పరిశీలించారు. దొంగతనం కేసును ఎలాగైనా ఛేదించాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, డిఎస్పీ జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు జైనథ్ సీఐ. సాయినాథ్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్‌లతో రెండు ప్రత్యేక టీములు ఏర్పాటు చేశారు. దొంగతనం జరిగిన సూపర్ మార్కెట్‌తో పాటు పరిసరప్రాంతంలో సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల ఫోటోలను చూసి మధ్యప్రదేశ్ కు చెందిన అంతరాష్ట్ర ముఠాగా గుర్తించారు. వీరిపై నిఘా ఏర్పాటు చేసి వారు చేస్తున్న పనులు, కదిలికలు అన్ని గమనించారు. ఇవాళ బేల బస్టాండ్ ప్రాంతంలో ఇట్టి ముఠాను పట్టుకుని విచారించారు. ఆదిలాబాద్‌లోని మావల ఏరియాలో చిన్న చిన్న గుడిసెలు వేసుకొని సంచార జీవితం గడుపుతూ చుట్టుపక్కల ఊర్లలో సంతలు, జాతరలో చిన్న చిన్న వస్తువులు అమ్ముకుంటూ అక్కడ దొంగతనాలు చేస్తుంటారని విచారణలో తేలింది. బేలలోని సూపర్ మార్కెట్లో దొంగతనం చేసిన కేసులో రాజనాసి రాథోడ్, అభిషేక్ సింగ్ రాథోడ్, షారుక్, తాహిర్, రుషి, ఇద్దరు మహిళలు బిజిలాబాయి, హీరాబాయి, ఒక మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రెండు లక్షల 41 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. మిగతా డబ్బులు మధ్యప్రదేశ్ కు చెందిన అప్సాన వద్ద ఉన్నట్లు తేలింది. వీరిపై సిద్దిపేట, సిరిసిల్ల, హైదరాబాద్, నిర్మల్ జిల్లాలో పలు దొంగతనం కేసులు ఉన్నట్లు వెల్లడైంది. అటు చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన పోలీస్ అధికారులను ఎస్పీ అభినందించారు.

# ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది..

## మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కళ్యాణి.. సీఎం మంత్రి సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం







**ములుగు, మహా :** రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఆర్థికంగా సామాజికంగా ఎదిగేందుకు అనేక పథకాలు అమలు చేస్తోందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కళ్యాణి అన్నారు. ఆదివారం ములుగులోని గాంధీ విగ్రహానికి పూలమా వేసినా అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఎలాంటి ప్రాధాన్యత ఇస్తుందో ప్రభుత్వం అమలు చేసే పథకాలే నిదర్శనం అని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్, ఇంకా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ,రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు రూ.500ల బోనస్ లాంటి పథకాలు అమలు చేస్తుందని, మంత్రి వర్గంలో మహిళలకు కూడా అవకాశాన్ని కల్పించి మహిళ శక్తి ముందుకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంత్రి సీతక్క ఎంతో మంది మహిళలలకు ఆదర్శంగా నిలుస్తూ, అన్ని రంగాల్లో మహిళలకు పెద్ద పీట వేస్తున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్ రెడ్డి, పీసీఎస్ చైర్మన్ చిక్కుల రాములు, మండల అధ్యక్షులు ఎండీ చాంద్ పాషా, ఎండీ.అఫ్సర్ పాషా, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్ కుమార్, బండి శ్రీను, నాయకులు ఓరుగంటి అనిల్, మండల మహిళ అధ్యక్షురాలు మద్దెల నాగమణి, నిర్మల, అమృత, చిలకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మహా పత్రిక









# సిరియా అధ్యక్షుడు అసద్ దుర్మరణం..


## విమానాన్ని కూల్చేసిన రెబల్స్..!

సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ మరణించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఆయన తన కుటుంబంతో కలిసి ప్రయాణిస్తున్న విమానాన్ని తిరుగుబాటుదారులు కూల్చివేసినట్లు సమాచారం. అధ్యక్షుడు బషర్ అల్ అసద్ కుటుంబంతో కలిసి రాజధాని డమాస్కస్ నుంచి బయలుదేరిన కొంతసేపటి ఆ విమానం జాడ లేకుండా పోయింది. దాంతో రెబల్సే దాన్ని కూల్చివేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సిరియాలో ప్రభుత్వ, ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటుదార్ల కారణంగా గత 15 ఏళ్ల నుంచి రణరంగాన్ని తలపిస్తున్నది. రెండు వైపుల నుంచి భారీ సంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోయారు. ఒకరిపై ఒకరు బాంబు దాడులు చేసుకుంటుండటంతో పెద్ద సంఖ్యలో అమాయక ప్రజలు కూడా మరణించారు. దేశమంతా రావణకాష్టంలా మారింది. సిరియా రాజధాని డమాస్కస్‌పై రెబల్స్ పట్టుబిగించడంతో అధ్యక్షుడు అసద్ కుటుంబంతో సహా పారిపోయేందుకు ప్రయత్నించి ప్రమాదం బారిన పడినట్లు తెలుస్తున్నది.

# రోదసిలో పుతిన్ రహస్య ఆయుధం

## ఏకంగా అణ్వాయుధాన్నే మోహరిస్తున్న రష్యా.. కాస్మోస్ 2553 ఉపగ్రహ సాయంతో సన్నాహాలు





**మాస్కో:** రష్యాకు చెందిన రహస్య ఉపగ్రహం 'కాస్మోస్ 2553' ప్రపంచ దేశాలను కలవరపెడుతున్నది. ప్రస్తుతం డమ్మీ వార్‌హెడ్ (ఆయుధం)తో భూకక్ష్య వెలుపలి హద్దుల్లో సంచరిస్తున్న ఈ ఉపగ్రహం సాయంతో మున్ముందు క్షిపణులను, అణ్వాయుధాలను ప్రయోగించి శత్రు దేశాలకు చెందిన పలు కీలక ఉపగ్రహాలను నాశనం చేసేందుకు రోదసిలో రష్యా ఓ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

అంతరిక్షంలో రష్యా మోహరించే ఆయుధానికి సంబంధించిన విడిభాగాలను ఈ ఉపగ్రహం పరీక్షిస్తున్నట్టు తాము భావిస్తున్నామని, దీని వల్ల ఎదురయ్యే ముప్పును తమ స్పేస్ కమాండ్ నిరంతరం పరిశీలిస్తున్నదని అమెరికా అధికారులు 'న్యూయార్క్ టైమ్స్' పత్రికకు తెలిపారు.
రష్యా సైనిక బలగాలను ఉక్రెయిన్‌లోకి పంపడానికి కొన్ని రోజుల ముందు (2022 ఫిబ్రవరిలో) రష్యాలోని ప్లెసెట్స్ కాస్మోడ్రోమ్ నుంచి సూయజ్ 2 రాకెట్ ద్వారా 'కాస్మోస్ 2553'ను నింగిలోకి పంపారు. అనంతరం ఆ ఉపగ్రహాన్ని దిగువ భూకక్ష్య చివరి అంచున (భూమికి దాదాపు 2 కి.మీ. ఎత్తున) చేర్చారు. ఆ ప్రాంతమంతా వాన్ అలెన్ బెల్ట్స్ నుంచి వచ్చే రేడియో ధార్మికతతో సంతృప్తమై ఉంటుంది.

ఇది ఉపగ్రహ భాగాలను నిర్వీర్యం చేస్తుంది. పనికిరాని లేదా నిలిపివేసిన ఉపగ్రహాలను నిశ్శబ్దంగా వాటంతట అవే నాశనమయ్యేలా చేసేందుకు దూరంగా ఆ ప్రాంతంలోకి పంపుతారు. దీంతో ఆ ప్రాంతాన్ని 'శ్మశాన కక్ష్య' అని పిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో 'కాస్మోస్ 2553'ను ఆ కక్ష్యలో నిలపడం అమెరికా ఖగోళ పరిశీలకుల్లో అనుమానాలను పెంచుతున్నది.



# పార్క్ రైడ్‌లో మృతికి పరిహారంగా రూ.2,612 కోట్లు

## అమెరికాలోని ఆరెంజ్ కౌంటీ ఆదేశం

**ఫ్లోరిడా:** ఐకాన్ పార్క్‌లోని ఓర్లాండో ఫ్రీ ఫాల్ రైడ్‌లో మరణించిన టైర్ శాంప్సన్ తల్లిదండ్రులకు రూ.2,612 కోట్లు నష్ట పరిహారంగా చెల్లించాలని ఆరెంజ్ కౌంటీ జ్యూరీ గురువారం ఆదేశించింది. టైర్ తల్లిదండ్రులు నెకియా డాడ్, యమెల్ శాంప్సన్‌లకు ఈ భారీ పరిహారంలో చెరి సగం ఇవ్వాలని ఈ రైడ్ మాన్యుఫ్యాక్చరర్ ఫన్‌టైమ్‌కు జ్యూరీ తెలిపింది. టైర్ 2022 మార్చి 24న రైడ్ చేశాడు. సీట్ బెల్ట్ సరైనది కాకపోవడంతో 70 అడుగుల ఎత్తు నుంచి పడి, ప్రాణాలు విడిచాడు. ఫన్‌టైమ్ కంపెనీ ఆస్ట్రియాకు చెందినది. కాబట్టి, ఆరెంజ్ కౌంటీ జ్యూరీ ఆదేశాల అమలు కోసం నెకియా, యమెల్ ఆస్ట్రియా కోర్టును ఆశ్రయించాల్సి ఉంటుంది.

# బంగ్లాదేశ్‌లో మరో ఇస్కాన్ సెంటర్‌కు నిప్పు..





**ఢాకా:** పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ ఆలయాలపై దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా మరో ఇస్కాన్ కేంద్రానికి దుండగులు నిప్పు పెట్టారు. అందులోని దేవుడి విగ్రహాలను ధ్వంసం చేశారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకా జిల్లాలో ఈ సంఘటన జరిగినట్లు ఇస్కాన్ కోల్‌కతా వైస్ ప్రెసిడెంట్ రాధారామన్ దాస్ తెలిపారు. శనివారం తెల్లవారుజామున 23 గంటల సమయంలో నామ్‌హట్టాలో ఇస్కాన్ కేంద్రం పరిధిలోని రాధా కృష్ణ దేవాలయం, మహాభాగ్య లక్ష్మీ నారాయణ ఆలయానికి దుండగులు నిప్పు పెట్టినట్లు తెలిపారు. ఆలయం పైకప్పులను తొలగించి లోపల పెట్రోల్ పోసి నిప్పంటించారని చెప్పారు. దీంతో విగ్రహాలతోపాటు ఇతర వస్తువులు మంటల్లో కాలి ధ్వంసమయ్యాయని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, బంగ్లాదేశ్‌లోని ఇస్కాన్ కేంద్రాలపై దాడులు కొనసాగుతున్నాయని రాధారామన్ దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ దేశంలోని తాత్కాలిక ప్రభుత్వం దృష్టికి ఈ దాడుల విషయం తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని విమర్శించారు. తమ ఆవేదన తగ్గించేందుకు, ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం, పోలీసులు ఏమీ చేయడం లేదని ఆరోపించారు.

# గుండెలో మినీ బ్రెయిన్

## హృదయ స్పందనను నియంత్రించేది ఇదే!

### అమెరికా, స్వీడన్ పరిశోధకుల అధ్యయనం



**స్టాక్‌హోమ్:** మెదడు నుంచి వచ్చే సంకేతాల ఆధారంగా గుండె పని చేస్తుందనేది ఇప్పటి వరకు వైద్యులు విశ్వసిస్తున్న విషయం. అయితే, గుండె తన సొంత నాడీ వ్యవస్థపైనే ఆధారపడి పని చేస్తుందని తాజాగా పరిశోధకులు గుర్తించారు. స్వీడన్‌లోని కరోలిన్స్క ఇన్‌స్టిట్యూట్, అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ కొత్త విషయాన్ని కనుగొన్నారు. మనుషుల శరీరతత్వంతో పోలికలు ఉండే జీబ్రాఫిష్‌పై వీరు నిర్వహించిన అధ్యయనం వివరాలు 'నేచర్ కమ్యూనికేషన్స్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ఈ అధ్యయనం ప్రకారం... ఇప్పటివరకు గుండెలోని నాడీ వ్యవస్థ కేవలం మెదడుపై ఆధారపడే పని చేస్తుందని అందరూ భావిస్తున్నారు. అయితే, గుండెలో సంక్లిష్టమైన న్యూరాన్ల వ్యవస్థ ఉందని పరిశోధకులు గుర్తించారు. 'మినీ బ్రెయిన్'గా పరిశోధకులు పేర్కొంటున్న ఈ వ్యవస్థనే హృదయ స్పందనను నియంత్రిస్తున్నది. ఎలాగైతే కదలికలు, ఊపిరి తీసుకోవడాన్ని మెదడు క్రమబద్ధీకరిస్తుందో, అలాగే ఈ గుండెలోని మినీబ్రెయిన్.. హృదయ స్పందనను నియంత్రిస్తున్నది. అరిథ్మియా వంటి గుండె సంబంధ వ్యాధుల చికిత్సకు తమ అధ్యయనం ఉపయోగపడుతుందని పరిశోధకులు పేర్కొన్నారు.

# ట్రంప్ ప్రచారం కోసం.. ఎలాన్ మస్క్ ఎన్ని వేల కోట్లు ఖర్చు చేశారో తెలుసా?




**వాషింగ్టన్:** ప్రపంచ కుబేరుడు మస్క్ అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం చివరి అంకంలో డొనాల్డ్ ట్రంప్ గెలుపు కోసం 250 మిలియన్ డాలర్లకు పైగా (సుమారు రూ.2,110 కోట్లు) ఖర్చు పెట్టినట్టు గురువారం విడుదలైన ఫెడరల్ ఫైలింగ్స్ వెల్లడించాయి. ఇలా కేవలం ఒక దాత నుంచి వచ్చిన విరాళాలు ట్రంప్ పరిపాలన అమల్లోకి రావడానికి దోహదపడ్డాయి. ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన తర్వాత ఆయన ప్రచారానికి మస్క్ భారీగా ఖర్చు పెట్టారు.

# భారత్ సరిహద్దుల్లో బంగ్లాదేశ్ కిల్లర్ డ్రోన్లు

## అప్రమత్తమైన ఆర్మీ



**ఢాకా, డిసెంబర్ 6:** ఇప్పటికే పలు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న పొరుగుదేశమైన బంగ్లాదేశ్.. అవసరమైతే దాడికి కూడా వెనుకాడమన్న రీతిలో భారత్ సరిహద్దుకు సమీపంలో టర్కీ తయారీ ఫ్లాగ్ టీబీ2 కిల్లర్ డ్రోన్లను మోహరించింది. బంగ్లాదేశ్‌లో ప్రధాని హసీనా పదవి నుంచి దిగిపోయిన తర్వాత ఈ ప్రాంతంలో ఉగ్రవాద కార్యకలాపాలు అధికమైనట్టు ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి. నవభారత్ టైమ్స్ కథనం ప్రకారం ఈ డ్రోన్లు పశ్చిమ బెంగాల్ సరిహద్దు సమీపంలో మోహరించి ఉన్నాయి. బంగ్లాదేశ్ ఆర్మీ ఈ టీబీ2 డ్రోన్లు రక్షణ, నిఘా మిషన్లలో వినియోగిస్తుంది. దీనిపై భారత్ ఆర్మీ స్పందిస్తూ.. తాము అప్రమత్తమయ్యామని, హెరన్ టీపీ లాంటి డ్రోన్లను మోహరించి ఉంచామని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపింది. కాగా, రెండు దేశాల మధ్య ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బంగ్లాదేశ్.. భారత్‌లో ఉన్న ఇద్దరు దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించింది.



8.5 లక్షల కోట్లతో..

# ప్రైవేటు అంతరిక్ష కేంద్రం నిర్మిస్తున్న జెఫ్ బెజోస్

**న్యూయార్క్, డిసెంబర్ 5 :** అంతరిక్ష వాణిజ్యంలో అపర కుబేరుల హవా నడుస్తున్నది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని కక్ష్య నుంచి సురక్షితంగా తొలగించే కాంట్రాక్టును ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ దక్కించుకోగా, కొత్త అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసే బాధ్యతను అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌కు చెందిన బ్లూ ఆరిజిన్ సంస్థ తీసుకుంది. ప్రస్తుతం ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) కాలపరిమితి ముగుస్తున్నది. 2031 నాటికి ఐఎస్ఎస్ కార్యకలాపాలు ముగుస్తాయి. ఈ నేపథ్యంలో కొత్త అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసే బాధ్యతను బ్లూ ఆరిజిన్ సంస్థకు నాసా అప్పగించింది. ఆర్బిటల్ రీఫ్ పేరుతో అభివృద్ధి చేస్తున్న ఈ కొత్త అంతరిక్ష కేంద్రం 8,200 క్యూబిక్ అడుగుల స్థలంలో ఉంటుంది. ఇది మొట్టమొదటి ప్రైవేటు అంతరిక్ష కేంద్రంగా నిలవనుంది. 2027లో దీనిని ప్రయోగించాలని, 2030 నుంచి పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్నారు.

### అంతరిక్ష పర్యాటకులకూ..

ఈ ప్రాజెక్టుకు ఏకంగా రూ.8.5 లక్షల కోట్లను బ్లూ ఆరిజిన్ సంస్థ ఖర్చు చేయనున్నది. సయెర్రా స్పేస్, అమెజాన్, బోయింగ్ వంటి సంస్థలతో కలిసి ఈ సంస్థ అంతరిక్ష కేంద్రాన్ని నిర్మిస్తున్నది. ఇప్పటివరకు ఉన్న అంతరిక్ష కేంద్రాలు కేవలం వ్యోమగాముల కోసం మాత్రమే వినియోగించారు. ఈ కొత్త కేంద్రాన్ని మాత్రం భవిష్యత్తులో అంతరిక్ష పర్యాటకులకు విడిదిగానూ వినియోగించేలా నిర్మిస్తున్నారు. మొదట 10 మందికి సరిపోయే స్థలంలో దీనిని నిర్మిస్తున్నారు. ఆ తర్వాత మరింత విస్తరించనున్నారు. భూ దిగువ కక్ష్యలో ప్రవేశపెట్టే ఈ స్పేస్ స్టేషన్‌కు భారీ కిటికీలు ఉంటాయని, అక్కడి నుంచి భూమిని వీక్షించవచ్చని బ్లూ ఆరిజిన్ సంస్థ తెలిపింది. వ్యక్తిగత, వ్యాపార వినియోగానికి వీలుగా ప్రత్యేక క్వార్టర్లను ఏర్పాటు చేస్తున్నామని, సురక్షితమైన, ఉత్తేజభరితంగా ఉండేలా సౌకర్యాలు కల్పిస్తున్నామని వెల్లడించింది.



# డమాస్కస్‌ను ఆక్రమించుకున్న తిరుగుబాటుదారులు..

## దేశం విడిచి పారిపోయిన సిరియా అధ్యక్షుడు!

**డామస్కాస్:** అంతర్యుద్ధంతో అట్టుకుతున్న సిరియాలో అధ్యక్షుడు బషర్ అల్-అసద్‌కు ఓటమి తప్పేలా లేదు. ఒక్కోనగరాన్ని చేజిక్కించుకుంటూ వస్తున్న తిరుగుబాటుదారులు ఏకంగా రాజధాని డమాస్కస్‌కు చేరుకున్నారు. ప్రభుత్వ బలగాల నుంచి ఎలాంటి ప్రతిఘటనా లేకపోవడంతో రాజధానిని ఆక్రమించుకున్నారు. చేజిక్కించుకునే అవకాశం ఉన్నది. డమాస్కస్‌లోని అంతర్జాతీయ విమానాశ్రం నుంచి సిరియా బలగాలు వెనుతిరిగాయి. కాగా, 2018 తర్వాత రాజధాని సమీపంలోకి తిరుగుబాటుదారులు చేరుకోవడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు అసద్ రాజధానిని విడిచి పారిపోయారు. విమానంలో గుర్తుతెలియని ప్రాంతానికి వెళ్లారని ఆర్మీ అధికారులు తెలిపారు. అయితే ఆయన రష్యాకు చెక్కేశారన్న వార్తలను ప్రభుత్వ దళాలు ఖండించాయి. ఉత్తర సిరియాపై హయాత్ తహరీర్ అల్-షామ్ (HTS) నేతృత్వంలోని తిరుగుబాటుదళాలు పట్టుబిగిస్తుంటే, దక్షిణ సిరియాలోని పరిస్థితి కూడా అసద్ వ్యతిరేకంగా మారింది. కీలక నగరమైన దారాతోపాటు స్వీడియా తదితర ప్రాంతాల నుంచి సిరియా సైన్యాలు శనివారం వైదొలగడం వల్ల అవి తిరుగుబాటుదారుల వశమయ్యాయి. ఇక, డమాస్కస్ శివారు ప్రాంతాలైన మదామియా, జరామానా, దరాయల్లో తిరుగుబాటుదారుల కదలికలు కనిపిస్తున్నాయని పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. 2011లో దారా నగరం నుంచి అసద్‌కు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభమైంది. ఆ తర్వాత అది అంతర్యుద్ధంగా మారింది. దారాలోని 90శాతం భూభాగం స్థానిక తిరుగుబాటుదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. దారాకు 50 కిలోమీటర్ల దూరంలోని సువైదా నుంచి కూడా ప్రభుత్వ దళాలు పారిపోయాయి. ఈ ప్రాంతాన్ని ఆక్రమించిన మైనారిటీ డ్రూజ్ తెగ మిలిటెంట్లు డమాస్కస్ దిశగా సాగుతున్నట్లు వార్తలొస్తున్నాయి. తిరుగుబాటుదారులు నగరాన్ని ఆక్రమిస్తారనే భయంతో డమాస్కస్‌లోని వేలాది మంది పౌరులు లెబనాన్ సరిహద్దులకు చేరుకుంటున్నారు.



## హార్డ్‌వేర్ ఎగుమతుల్లో

# భారత్ దూకుడు..

### FIEO సీఈవో కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** హార్డ్‌వేర్ ఎగుమతులకు భారత్ సిద్ధంగా ఉందని భారత ఎగుమతి సంస్థల సమాఖ్య (FIEO) సీఈవో అశ్వనీ కుమార్ శనివారం తెలిపారు. ప్రగతి మైదాన్‌లో ఇంటర్నేషనల్ హార్డ్‌వేర్ ఫెయిర్ ఇండియా రెండో ఎడిషన్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగిస్తూ పలు కీలక విషయాలు పంచుకున్నారు. దేశ దృక్పథానికి అనుగుణంగా ఈ ఈవెంట్ ప్రాముఖ్యతను ఆయన హైలైట్ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఊహించిన విధంగా గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా భారత్ మారబోతుందని అన్నారు. తయారీ, నిర్మాణం సాంకేతికత వంటి పరిశ్రమలలో హార్డ్‌వేర్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. హార్డ్‌వేర్ ఎగుమతుల్లో భారత్ 2023లో 15% వార్షిక వృద్ధిని సాధించిందని, 2027 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలనే లక్ష్యంతో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. సామూహిక దృక్పథంతో, బలమైన వృద్ధి పథం, వ్యూహాత్మక ప్రభుత్వ కార్యక్రమాలతో భారత్ ప్రపంచ దేశాల్లో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ గుర్తింపు పొందిందని ఆయన అన్నారు. భారతదేశ ఎగుమతి ఊపందుకుంటుందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (FIEO) డైరెక్టర్ జనరల్, సీఈవో అజయ్ సహాయ్ అన్నారు. భారత్ గణనీయమైన ఎగుమతి వృద్ధికి సిద్ధంగా ఉంది. 2030 నాటికి 2 ట్రిలియన్ల డాలర్ల లక్ష్యంతో ఉంది. ఇటీవలి సంవత్సరాలలో మా ఎగుమతులు 478 బిలియన్ డాలర్ల నుంచి 778 బిలియన్ డాలర్లకు ఎగబాకాయన్నారు. ఇది 8% వార్షిక వృద్ధి రేటును సూచిస్తుందని అన్నారు. ఇదే ఈ వేగాన్ని కొనసాగించడానికి తాము 14% CAGR లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దేశ సపోర్టివ్ ఎకోసిస్టమ్, సాంకేతిక నైపుణ్యాల కారణంగా దీనిని సాధించవచ్చని అతను అన్నారు. అనంతరం Koelnmesse Pvt Ltd మేనేజింగ్ డైరెక్టర్ మిలింద్ దీక్షిత్ మాట్లాడుతూ.. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి, పెరిగిన మౌలిక సదుపాయాల వ్యయంతో, హార్డ్‌వేర్, నిర్మాణ సామగ్రికి డిమాండ్ పెరుగుతోందన్నారు.

ఇంటర్నేషనల్ హార్డ్‌వేర్ ఫెయిర్ 2024 రెండవ ఎడిషన్ డిసెంబర్ 6న న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ప్రారంభమైంది. ప్రారంభోత్సవ వేడుకకు FIEO అధ్యక్షుడు Mr అశ్వనీ కుమార్‌తో సహా ప్రముఖ ప్రముఖులు హాజరయ్యారు. చైనా, కొరియా, ఇటలీ, తైవాన్ నుంచి దాదాపు 250 మంది ఎగ్జిబిటర్స్, అంతర్జాతీయ పెవిలియన్లు, 35 దేశాల నుండి పది వేలకుపైగా ట్రేడ్ విజిటర్స్ పాల్గొన్నారు. భారత దేశ ఫర్నిచర్ హార్డ్‌వేర్ మార్కెట్ 2024 నుంచి 2029 వరకు 15.49 శాతం (CAGR) వృద్ధి చెందుతుందని అంచనా వేసింది. 2024లో 3.04 బిలియన్ డాలర్ల నుండి 6.26 బిలియన్ డాలర్లకు విస్తరించింది.

## సువెన్ ఫార్మా చేతికి అమెరికా సంస్థ!




**హైదరాబాద్ :** రాష్ట్రానికి చెందిన సువెన్ ఫార్మాస్యూటికల్..అమెరికా కేంద్రస్థానంగా కార్యకలాపాలు అందిస్తున్న ఎన్‌జే బియో ఇండస్ట్రీలో మెజార్టీ వాటాను కొనుగోలు చేయబోతున్నది. 64.4 మిలియన్ డాలర్లతో(రూ.500 కోట్లకు పైమాటే) ప్రింజెక్షన్, ఎన్‌జే బియోలో 56 శాతం వాటాను కొనుగోలు చేస్తున్నట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఈ లావాదేవీ ఏడీసీ వంటి అభివృద్ధి చెందుతున్న పద్ధతుల్లో ఎండ్-టు-ఎండ్ సొల్యూషన్‌లను అందించే టెక్నాలజీకి అనుగుణంగా ఉన్నదని సువెన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వివేక్ శర్మ తెలిపారు. ఈ ఒప్పందం ఈ నెల చివరినాటికి పూర్తికాగలదన్న విశ్వాసాన్ని వ్యక్తంచేశారు.

## విద్యార్థులకు ఎల్ఐసీ నుంచి స్కాలర్‌షిప్.. ఎవరు అర్హులు..!




లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (LIC) స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రారంభించింది. దీని కింద విద్యార్థులకు చదువుల కోసం రూ. 15,000 నుండి రూ. 40,000 వరకు సహాయం అందిస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు చదువులో సహాయం చేయడమే ఈ పథకం లక్ష్యం. ఈ పథకం కోసం దరఖాస్తు ప్రక్రియ డిసెంబర్ 8 నుండి ప్రారంభమవుతుంది. దరఖాస్తుకు చివరి తేదీ డిసెంబర్ 22. మీరు కూడా ఈ పథకం ప్రయోజనాన్ని పొందాలనుకుంటే వివరాలు తెలుసుకోండి.

**ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్‌కు అర్హత ఏమిటి?**

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థుల కోసం ఈ స్కాలర్‌షిప్ పథకం. 202122, 202223 విద్యా సంవత్సరంలో కనీసం 60% మార్కులు లేదా 10వ/12వ/డిప్లొమాలో CGPA లేదా 202324, 2024లో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులకు ఈ పథకం భారతదేశం అంతటా అందుబాటులో ఉందని ఎల్ఐసీ తెలిపింది. రెండు వేర్వేరు కేటగిరీలలో అందుబాటులో ఉండనుంది.

**సాధారణ స్కాలర్‌షిప్:**

మెడిసిన్ (MBBS, BAMS, BHMS, BDS) విభాగంలో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు సంవత్సరానికి రూ. 40,000 అందిస్తుంది. ఇది కోర్సు వ్యవధిలో ఒక్కొక్కరికి రూ.20,000 చొప్పున రెండు విడతలుగా అందిస్తుంది. ఇంజినీరింగ్ (బీఈ, బీటెక్, బార్చ్)లో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఏడాదికి రూ.30 వేలు. ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున రెండు విడతలుగా అందజేస్తారు. గ్రాడ్యుయేషన్ (ఏదైనా విభాగంలో), ఇంటిగ్రేటెడ్ కోర్సు, డిప్లొమా, ఒకేషనల్ కోర్సు (ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాశాల/ఇన్‌స్టిట్యూట్ లేదా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఐటీఐ)లో చదువుతున్న విద్యార్థులకు సంవత్సరానికి రూ. 20,000 అందజేస్తారు. దీనిని రెండు వాయిదాలుగా అందిస్తుంది. ఒక్కొక్కరికి 10,000 అందిస్తారు.

**ప్రత్యేక స్కాలర్‌షిప్ (అమ్మాయి)**

10వ తరగతి తర్వాత ఇంటర్మీడియట్/10+2 ప్యాటర్న్ లేదా వొకేషనల్/డిప్లొమా కోర్సు (ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాశాల/ఇనిస్టిట్యూట్ లేదా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఐటీఐ)లో రెండేళ్లపాటు చదువుతున్న బాలికలకు సంవత్సరానికి రూ.15,000 ఇస్తారు. రెండు రూ.7,500 విడతల వారీగా అందుతుంది.

### ఎలా దరఖాస్తు చేయాలి?

విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపాల్సి ఉంటుంది.
మీరు ఎల్ఐసీ వెబ్‌సైట్ www.licindia.inలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించిన తర్వాత, అభ్యర్థి ఇచ్చిన ఇమెయిల్ IDకి ఆమోదం పొందినట్లు మెయిల్ అందుతుంది.
మరింత సమాచారం ఆ డివిజనల్ కార్యాలయం ద్వారా అంగీకార మెయిల్ అందుతుంది.
అభ్యర్థి సరైన ఇమెయిల్ ID, సంప్రదింపు నంబర్ అందించాలి.
స్కాలర్‌షిప్ మొత్తం NEFT ద్వారా ఎంపికైన విద్యార్థి బ్యాంక్ ఖాతాకు బదిలీ చేస్తారు.
నగదు బదిలీ చేయబడే బ్యాంక్ ఖాతా తప్పనిసరిగా యాక్టివ్‌గా ఉండాలని గుర్తించుకోండి.

# క్రీడా వార్తలు | SPORTS NEWS

## రిషిత ఖాతాలో మరో టైటిల్




**హైదరాబాద్ :** అంతర్జాతీయ స్థాయిలో వరుస టైటిల్స్‌తో అదరగొడుతున్న తెలంగాణ యువ టెన్నిస్ క్రీడాకారిణి బసిరెడ్డి రిషిత రెడ్డి మరోసారి సత్తా చాటింది. పూణెలో ఈనెల 27 తేదీలలో జరిగిన ఐటీఎఫ్ వరల్డ్ టెన్నిస్ టూర్ జూనియర్స్‌జే100 గర్ల్స్ సింగిల్స్ టైటిల్‌ను ఆమె కైవసం చేసుకుంది. గర్ల్స్ సింగిల్స్ ఫైనల్‌లో రిషిత.. 62, 75తో అయో వటనబె (జపాన్)ను వరుస సెట్లలో చిత్తు చేసి మరో జూనియర్ టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. ఇది ఆమెకు వరుసగా మూడో టైటిల్ కావడం విశేషం.

## అడిలైడ్ టెస్ట్‌లో 10 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం..

అడిలైడ్ టెస్ట్‌లో ఆతిథ్య జట్టు ఆస్ట్రేలియా పది వికెట్ల తేడాతో టీమిండియాపై ఘన విజయం సాధించింది. ఐదు టెస్ట్‌లో సిరీస్‌లో 11తో సమం చేసింది. తొలి టెస్ట్‌లో అద్భుతమైన ఆటతీరుతో గెలుపొందిన జట్టు.. రెండో డేనైట్ టెస్ట్‌లో అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోను టీమిండియా చేతులెత్తేసింది. అయితే, ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య కేవలం రికార్డు స్థాయిలో అత్యంత తక్కువ సమయంలోనే ఈ మ్యాచ్ ముగిసింది. ఈ టెస్ట్‌లో అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌తోనూ అద్భుత ప్రదర్శన చేసిన ఆస్ట్రేలియా.. టెస్ట్ సిరీస్‌ను 11తో సమం చేసింది. ఇక మూడో టెస్ట్ డిసెంబర్ 14 నుంచి బ్రిస్బేన్‌లో జరగనుంది. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 18 పరుగుల లక్ష్యం బరిలోకి దిగింది. వికెట్ నష్టపోకుండా 19 పరుగులు చేసి.. లక్ష్యాన్ని చేరుకున్నది. ఓపెనర్లు ఉస్మాన్ ఖవాజా (9), నాథన్ మెక్స్వీనీ (10) పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. ఇదిలా ఉండగా.. భారత్ రెండో ఇన్నింగ్స్ 175 పరుగులకే కుప్పకూలింది.




టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 180 పరుగులు చేయగా, ఆస్ట్రేలియా తన తొలి ఇన్నింగ్స్‌లో 337 పరుగులు చేసింది. దీంతో రెండో ఇన్నింగ్స్‌లో 157 పరుగుల ఆధిక్యం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 175 పరుగులు చేసి ఆస్ట్రేలియాపై 18 పరుగుల ఆధిక్యం సంపాదించి కంగారూలకు 19 పరుగుల లక్ష్యాన్ని అందించింది. ఐదు వికెట్ల నష్టానికి 128 పరుగుల వద్ద ఆదివారం ఆట ప్రారంభించిన టీమిండియా 47 పరుగుకే ఐదు వికెట్లను కోల్పోయింది. రిషబ్ పంత్ రూపంలో టీమ్ ఇండియాకు తొలి దెబ్బ తగిలింది. 28 పరుగులు చేసి స్టార్క్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. ఆ తర్వాత అశ్విన్ (7), హర్షిత్ రాణా (0), నితీశ్ రెడ్డి (42), సిరాజ్ (7) స్కోర్ మాత్రమే చేయగలిగారు. టీమిండియా తరఫున అత్యధిక స్కోర్ చేసింది నితీశ్ కుమార్‌రెడ్డి మాత్రమే. అతను 47 బంతుల్లో 42 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా బౌర్లలో కెప్టెన్ కమిన్స్ ఐదు వికెట్లు తీయగా.. బోలాండ్‌కు మూడు వికెట్లు, స్టార్క్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో సెంచరీతో కదం తొక్కిన ట్రావిస్ హెడ్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.




## ట్రావిస్ హెడ్ చెప్పినవన్నీ అబద్ధాలే..

# హైదరాబాదీ బౌలర్ సిరాజ్..

అడిలైడ్ ఓవల్ మైదానంలో ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరిగిన టెస్ట్‌లో ఆసిస్ బ్యాటర్ ట్రావిస్ హెడ్, టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ మధ్య మాటల యుద్ధం జరిగిన విషయం తెలిసిందే. ట్రావిస్ హెడ్‌ను క్లీన్ బౌల్డ్ చేశాక సిరాజ్ సంబరాలు చేసుకుంటూ సైగలు చేసిన విసయం తెలిసిందే. అయితే, హెడ్ తాను వెల్ బౌల్డ్ అన్నానని.. సిరాజ్ తప్పుగా అర్థం చేసుకున్నాడని ప్రెస్ కాన్ఫరెన్స్‌లో హెడ్ పేర్కొన్నారు. సిరాజ్‌కు తాను మాట్లాడిందని అర్థం కాలేదని చెప్పగా.. సిరాజ్ ఆ వ్యాఖ్యలను ఖండించారు. హెడ్ అబద్ధం చెప్పాడని.. భారత జట్టు ప్రతి క్రీడాకారుడిని గౌరవిస్తుందన్నాడు. తాను ఇంతకు ముందెప్పుడూ వివాదాన్ని ప్రోత్సహించలేదని స్పష్టం చేశాడు. హెడ్ తనను దుర్భాషలాడడని.. అందుకు తాను దూకుడుగా వ్యవహరించాల్సి వచ్చిందని హైదరాబాదీ బౌలర్ పేర్కొన్నాడు. తాను హెడ్‌కు బౌలింగ్ చేయడాన్ని ఆనందించానని.. బాగా బ్యాటింగ్ ఎంజాయ్ చేస్తానని.. ఇద్దరి మధ్య గ్రౌండ్‌లో పోరుగు జరుగుతుందని చెప్పాడు. ఓ మంచి బంతిని వేసిన సమయంలో సిక్స్‌గా మలిస్తే ఏ బౌలర్‌కైనా బాధగానే ఉంటుందని సిరాజ్ చెప్పాడు. అందుకే హెడ్ అవుట్ అయ్యాక సంబరాలు చేసుకున్నానని చెప్పాడు. కానీ, ఆస్ట్రేలియా బ్యాటర్ అబద్ధాలు చెప్పాడని.. వెల్ బౌల్డ్ అన్నానని చెబుతున్నాడని.. అతను చెప్పిన దాంట్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశాడు. క్రికెట్ జెంటిల్‌మన్ గేమ్ అని.. హెడ్ ప్రవర్తన మాత్రం తప్పని.. నాకు బాగా అనిపించలేదని చెప్పాడు. అయితే, సిరాజ్‌తో వ్యహారంపై ట్రావిస్ హెడ్ మాట్లాడుతూ తాను బాగా బౌలింగ్ చేశామని చెప్పానని.. దాన్ని తప్పుగా అర్థం చేసుకున్నాడని చెప్పాడు. ఈ వ్యవహారంలో కాస్త నిరాశకు గురయ్యానని.. భారత్ ఇలాగే ఆడాలని కోరుకుంటే.. అలాగే ఆడాలని చెప్పాడు. అడిలైడ్ వేదికగా జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియా 10 వికెట్ల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. ఈ విజయంతో కంగారూ జట్టు సిరీస్‌లో పునరాగమనం చేసింది. ప్రస్తుతం ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 11తో సమం చేసింది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ రోహిత్ శర్మ ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు.

## ఏషియన్ త్రోబాల్ పోటీల్లో భారత్‌కు బంగారు పతకం

**శామీర్‌పేట :** కాంబోడియాలో ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు జరిగిన పారా ఏషియన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భారతదేశానికి బంగారు పతకం లభించింది. పారా ఏషియన్ సెక్రటరీ వివేషన్ చేతుల మీదుగా టీమ్ వైస్ కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ సెక్రటరీ సింగారపు బాబు, దీరావత్ మహేశ్‌నాయక్‌లు బంగారు పథకాలను అందుకున్నారు. ఈ సందర్భంగా లింగాపూర్ తాండాకు చెందిన దీరావత్ మహేశ్‌నాయక్ మాట్లాడుతూ.. కాంబోడియాకి వెళ్లేందుకు దాతల సహకారం కోసం నమస్తే తెలంగాణలో వచ్చిన కథనానికి స్పందించిన మాజీ మంత్రి కేటీఆర్.. రూ.1 లక్ష సహకారం అందించారని తెలిపారు. దివ్యాంగ సమాజానికి ముందుండి నడిపిస్తున్న కేటీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నేడు సాధించిన ఈ విజయాన్ని కేటీఆర్‌తో పాటు తెలంగాణ ప్రజలకు అంకితం ఇస్తున్నామన్నారు.




## ఎనిమిదో డ్రా

**సింగపూర్:** డ్రాల పర్వం కొనసాగుతున్న ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో శనివారం పదో గేమ్‌లో సైతం అదే ఫలి తం నమోదైంది. గుకేశ్, లిరెన్ మధ్య జరిగిన పదో గేమ్ కూడా డ్రా గా ముగిసింది. ఈ టోర్నీలో ఇది ఎనిమిదో డ్రా కాగా వరుసగా ఏడోది. 36 ఎత్తుల తర్వాత ఇరువురు ఆటగాళ్లు డ్రాకు అంగీకరించారు. ఈ టోర్నీ తొలి గేమ్‌ను లిరెన్ గెలుచుకోగా మూడో గేమ్‌ను గుకేశ్ నెగ్గాడు. ఆ తర్వాత ఇద్దరూ గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నా ఫలితాలలో మాత్రం మార్పు రావడం లేదు. పదో గేమ్ ముగిసిన తర్వాత ఇరువురూ 5 పాయింట్లతో సమానంగా నిలిచారు.



## రాజమౌళి-మహేశ్ ప్రాజెక్ట్ సెట్స్ మీదకి వెళ్ళేది అప్పుడే..!

టాలీవుడ్ దర్శక దిగ్గజం ఎస్.ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. SSMB29 అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు పట్టాలెక్కుతుందా అని అటు బాబు ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ తెగ ఎదురుచూస్తున్నారు. హాలీవుడ్ సినిమాను తలపించేలా ఈ సినిమా ఉండబోతుందని రాజమౌళి ఈ సినిమా గురించి ఇప్పటికే హింట్ ఇచ్చాడు. దీంతో మూవీ ఎలా ఉండబోతుందని అందరూ ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. మరోవైపు ఈ సినిమాను రూ.1000 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించబోతున్నట్లు సమాచారం. అయితే ఈ మూవీ షూటింగ్‌కు సంబంధించి ఒక సాలిడ్ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ మూవీ షూటింగ్‌ను వచ్చే ఏడాది ఏప్రిల్ మూడో వారం తర్వాత స్టార్ట్ చేయనున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం లొకేషన్లు, నటీనటుల ఎంపికలో రాజమౌళి బిజీగా ఉండడంతో షూటింగ్ మరింత ఆలస్యం అవుతుండడంతో మేకర్స్ ఏప్రిల్‌లో సెట్స్ మీదకి వెళ్లాలని ప్లాన్ చేసుకున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందనున్న ఈ చిత్రంలో ఇండోనేషియన్ బ్యూటీ చెల్సియా ఇస్లాన్ హీరోయిన్‌గా ఎంపికైనట్లు టాక్.





## అఫీషియల్.. రష్మిక మందన్నా ది గర్ల్‌ఫ్రెండ్‌కు విజయ్ దేవరకొండ సపోర్ట్

పుష్ప 2 ది రూల్ సక్సెస్‌ను ఫుల్ ఎంజాయ్ చేస్తోంది నేషనల్ క్రష్, కన్నడ సోయగం రష్మిక మందన్నా. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న ఈ భామ లీడ్ రోల్‌లో నటిస్తోన్న సినిమా ది గర్ల్‌ఫ్రెండ్. టాలీవుడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీకి స్టార్ యాక్టర్ విజయ్ దేవరకొండ సపోర్ట్ ఇవ్వబోతున్నాడని ఇప్పటికే ఓ వార్త నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా దీనికి సంబంధించి అధికారిక ప్రకటన బయటకు వచ్చింది. ఇప్పటికే అనౌన్స్‌మెంట్ వీడియో అందరి ఫోకస్ తన వైపు తిప్పుకుంటున్న రష్మిక ఇక టీజర్‌తో సందడి చేయనుంది. ఈ మూవీ టీజర్‌ను రౌడీబాయ్ రేపు (డిసెంబర్ 9)ఉదయం 11:07 గంటలకు లాంచ్ చేయనున్నాడు. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. బాయ్‌ఫ్రెండ్ విజయ్ దేవరకొండ రష్మిక టీజర్ లాంచ్ చేస్తుండటంతో అభిమానుల్లో క్యూరియాసిటీ పెరిగిపోతుంది. ఇంతకీ టీజర్‌ఎలాంటి కంటెంట్ ఉండబోతుందనేది ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అభిమానులు, మూవీ లవర్స్. ఈ చిత్రంలో చికాగో భామ అనూ ఇమ్మాన్యుయేల్ కీ రోల్‌లో నటిస్తుండగా.. కన్నడ యాక్టర్ దీక్షిత్ శెట్టి కీలక పాత్ర పోషిస్తున్నాడు.అల్లు అరవింద్ సమర్పణలో మాస్ మూవీ మేకర్స్,


## మ్యాజిక్ ఎక్స్‌పీరియన్స్ కోసం..

'మిస్టర్ బచ్చన్' సినిమాతో అందరి దృష్టిని ఆకర్షించింది పూణే భామ భాగ్యశ్రీబోర్సే. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే చేస్తున్న క్రేజీ ప్రాజెక్టుల్లో 'కాంత' ఒకటి. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తూ, రానా దగ్గుబాటితో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఇటీవలే ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. రీసెంట్‌గా ఈ సినిమా షూటింగ్ కూడా మొదలైంది.ఈ విషయాన్ని తెలియజేస్తూ లొకేషన్‌లో దుల్కర్‌తో కలిసి ఉన్న తన ఫొటోను ఇన్‌స్టాలో షేర్ చేసింది భాగ్యశ్రీ బోర్సే. ' 'కాంత' ప్రపంచంలో మ్యాజిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ఆస్వాదించడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా..' అంటూ ఆ ఫొటోతో పాటు కామెంట్ కూడా జత చేసింది. ఇక ఈ సినిమా విషయానికొస్తే.. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో 1950 నాటి మద్రాసు మహానగరంలో జరిగిన కథగా ఈ సినిమాను దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ తెరకెక్కిస్తున్నారు. సముద్రఖని కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు.



## మూడు రోజుల్లో రూ.200 కోట్లు..

### బాలీవుడ్‌లో బీభత్సం సృష్టిస్తున్న పుష్ప 2..




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన క్రేజీ సీక్వెల్ పుష్ప 2 ది రూల్ (Pushpa 2 The Rule) బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తుంది. ఈ సినిమా హిందీలో షారుఖ్ ఖాన్ జవాన్(Jawan) పేరిటా ఉన్న రికార్డును బద్దలుకొట్టిన విషయం తెలిసిందే.హిందీలో జవాన్ సినిమా ఫస్ట్ డే రూ.65 కోట్ల కలెక్షన్స్ రాబట్టగా.. ఫస్ట్ రోజు ఆ రికార్డును అధిగమించాడు అల్లు అర్జున్. మొదటి రోజు రూ.72 కోట్ల కలెక్షన్లు రాబట్టిన విషయం తెలిసిందే. తాజాగా మూడో రోజు ఏకంగా రూ.74 కోట్ల వసూళ్లను రాబట్టింది. దీంతో మొదటి రోజు సాధించిన రూ.72 కోట్ల కలెక్షన్లు అధిగమించి తన రికార్డును తానే తిరగరాశాడు. దీంతో హిందీలో మూడు రోజుల్లో ఈ చిత్రం రూ.205 కోట్లు రాబట్టిన తొలి తెలుగు చిత్రంగా నిలిచింది. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 12000 వేలకు పైగా థియేటర్లలో విడుదలైన విషయం తెలిసిందే.



## ఐటమ్‌సాంగ్స్ ఇక చేయను

'కిస్సిక్' అంటూ 'పుష్ప2'లో శ్రీలీల చేసిన సందడి అంతా ఇంతాకాదు. తనందులో చేసింది ఓ పాటే అయినా.. హీరోయిన్‌కి వచ్చినంత పేరొచ్చింది. అయితే.. ఫిల్మ్ వర్గాల సమాచారం ప్రకారం శ్రీలీల కెరీర్‌లో తొలి ఐటమ్ సాంగ్.. చివరి ఐటమ్ సాంగ్ కూడా 'కిస్సిక్' సాంగేనట. ఇక జీవితంలో తను ఐటమ్ నంబర్ చేయదని తెలుస్తున్నది. నిజానికి చిరంజీవి 'విశ్వంభర'లో కూడా ఓ ఐటమ్ సాంగ్‌కి శ్రీలీలను అడిగారు. ఆ ఆఫర్‌ని తను సున్నితంగా తిరస్కరించిందని ఫిల్మ్‌వర్గాల భోగట్టా. అయితే.. 'పుష్ప2'కు ఉన్న క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకొని, తొలి పార్ట్‌లో సమంత ఐటమ్‌సాంగ్ చేసింది కాబట్టి, మలి పార్ట్‌లో తాను చేయడం సబబేనని భావించి ఈ పాటను శ్రీలీల అంగీకరించిందని తెలుస్తున్నది. రీసెంట్‌గా ఇలాంటి ఆఫర్లు ఎన్ని వస్తున్నా.. ఎంత పారితోషికాన్ని ఆఫర్ చేస్తున్నా శ్రీలీల మాత్రం కేర్ చేయడం లేదట.'చేస్తే హీరోయిన్‌గానే చేస్తా.. లేకపోతే ఖాళీగా ఉంటా.. అంతేకానీ.. ఐటమ్ సాంగ్స్ మాత్రం చేయను' అని ఖరాకండీగా చెప్పేస్తున్నదట. ఈ నెల 25న నితిన్‌కు జోడీగా ఆమె నటించిన 'రాబిన్‌హుడ్' సినిమా విడుదల కానుంది. అంతేకాక, తమిళంలో శివకార్తికేయన్‌తో కూడా ఓ సినిమా చేస్తున్నది శ్రీలీల.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com